# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం



రిపోర్టర్లు కావలెను

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459



సంపుటి: 01 | సంచిక: 324 | హైదరాబాద్ | ఆదివారం | 11-05-2025 | పేజీలు: 08


# మళ్లీ భారత్‌పై పాక్ అటాక్..?

## వక్ర బుద్ధి పోనిచ్చుకోని పాకిస్థాన్..!

కాల్పుల విరమణను పాక్ ఉల్లంఘించడంపై ఆగ్రహం

స్ట్రాంగ్ కౌంటర్ ఎటాక్ మొదలుపెట్టిన భారత్

పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పాలని భారత్ నిర్ణయం

బార్డర్‌లో దళాలకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన ప్రభుత్వం


నేషనల్ బ్యూరో, మే 10(ప్రజాక్షేత్రం)::

ఇండియా దాయాది దేశాల మధ్య కాల్పులు విరమణ ఒప్పందం జరిగిన విషయం తెలిసింది. అయితే ఒప్పందం జరిగిన కొన్ని గంటల్లోనే పాక్ తన వక్ర బుద్ధిని చాటుకుంది. జమ్ముకశ్మీర్ లో మరోసారి కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించి ఫిరంగులతో, డ్రోన్ లతో దాడులు చేస్తున్నట్టు వార్తలు వైరల్ అవుతున్నాయి.

జమ్ము కశ్మీర్ లోని నియంత్రణ రేఖ వెంబడి పాక్ కాల్పులకు దిగినట్టు తెలుస్తోంది. రాజోరి, ఆర్ఎస్ పుర, అక్నూర్ లో సాధారణ పౌరులే లక్ష్యంగా పాక్ కాల్పులు జరుపుతున్నట్టు సమాచారం. కశ్మీర్ లో పలు ప్రాంతాల్లో కాల్పులు శబ్దాలు వినిపించినట్టు సీఎం ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై

మిగతా 2వ పేజీలో





# రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ రోజులు కొనసాగదు

ఈ సర్కార్ కు తలా.., తోకలేదు

తుగ్లక్ ప్రభుత్వం.., తుగ్లక్ సీఎం

ఆయనో శాడిస్ట్, సైకో. అందుకే

ప్రజలను ఏడిపిస్తున్నాడు

గ్రౌండ్ రియాలిటీ తెప్పించుకుని

సమస్యలు పరిష్కరించు

ఎంపీ ఈటల రాజేందర్



02

# కులగణనను ప్రజల్లోకి తీసుకెళ్తాం

మోడీ ప్రధాన అయ్యాక

ఓబీసీలకు ప్రాధాన్యత పెరిగింది

కులగణనతోనే దేశాభివృద్ధి

రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

కులగణనను గత సర్కార్ పట్టించుకోలేదు

రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



02

# వారు చంపేవారుగా, మనం చచ్చేవారిగా పరిస్థితి ఉండేది

అందుకే సైన్యానికి

అమ్మవారి ఆశీస్సులు

అవసరం

నేడు ప్రతి దేవాలయంలో

ప్రత్యేక పూజలు చేపట్టాలి

రేపు దేశ వ్యాప్తంగా

తిరంగా ర్యాలీలు చేయండి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కార్యకర్తలకు దిశానిర్దేశం




02



# మేం వ్యతిరేకం కాదు

సీఎం ఆలోచనా

విధానం మారాలి

బీఆర్ఎస్ నేత

కేపీ వివేకానంద

# డ్రగ్స్‌తో పట్టుబడ్డ లేడీ డాక్టర్

నాలుగేళ్లలో

రూ.70 లక్షల ఖర్చు

సప్లయర్ కూడా అరెస్ట్

విచారణలో వెలుగులోకి

సంచలన నిజాలు



02

# మట్టు పెట్టాల్సిందే..

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



02

## యుద్ధ ప్రాతిపదికన

# సీతారామ ప్రాజెక్టు

సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతంచేయాలి

ప్రస్తుత డిజైన్ మేరకు ముందుకెళ్తాం

అవసరమైన చోట లింక్ కెనాల్ తో పనులు చేపట్టాలి

కాంగ్రెస్ ప్రభుత్వ కృషితో నీటి కేటాయింపులు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



02

## వారు చంపేవారుగా, మనం చచ్చేవారిగా పరిస్థితి ఉండేది

- అందుకే సైన్యానికి అమ్మవారి ఆశీస్సులు అవసరం
- నేడు ప్రతి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టాలి
- రేపు దేశ వ్యాప్తంగా తిరంగా ర్యాలీలు చేయండి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- కార్యకర్తలకు దిశానిర్దేశం

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):** గతంలో పాకిస్తాన్ చంపేవారుగా, భారత్.. చచ్చేవారుగా పరిస్థితులు ఉండేవని, కానీ ప్రధాని మోడీ సారథ్యంలో భారత ఆర్మీ.., పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలపై వీరోచిత పోరాటం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాగా భారత సైన్యానికి మరింత ఆత్మ స్థైర్యాన్ని అందించాలని ప్రార్థిస్తూ కిషన్ రెడ్డి బషీర్‌బాగ్ ఎలిమినేటి మాధవరెడ్డి ఫ్లై ఓవర్ కింద ఉన్న అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతో భారత సైన్యం పోరాటం చేస్తోందని, అమ్మవారి ఆశీస్సులు భారత సైన్యానికి కావాలని పేర్కొన్నారు. గత నెల 22న పెహల్ గావ్ ఘటన జరిగిందని, 26 మంది భారతీయులను పాకిస్తాన్ ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారన్నారు. దేశ సమగ్రతను, సమైక్యతను, అభివృద్ధిని దెబ్బతీయాలని అనేక ఏండ్లుగా పాకిస్తాన్ ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శలు చేశారు. గతంలో కూడా హైదరాబాద్ నగరంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు నరమేధం సృష్టించారని ఆయన గుర్తుచేశారు. భారత సైన్యం సాహసంతో పాకిస్తాన్ గడ్డమీదకు వెళ్లి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాయని కొనియాడారు. 140 కోట్ల భారత ప్రజలు ఐక్యంగా సైనికులకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారత సైన్యానికి మద్దతుగా ప్రజలు ప్రత్యేక పూజలు సంఘీభావ ర్యాలీలు చేయాలని కిషన్ రెడ్డి కోరారు. భారత సైన్యానికి అండగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని, ప్రతి బస్తీలో సంఘీభావ ర్యాలీలు చేయాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతేకాకుండా సోమవారం దేశ వ్యాప్తంగా తిరంగ ర్యాలీలు నిర్వహించాలని కోరారు.




# మళ్లీ భారత్‌పై పాక్ అటాక్..?

మొదటిపేజీ తరువాయి

నిర్ణయం తీసుకున్న నాలుగు గంటలకే మళ్ళీ పాక్ దాడులకు దిగుతుండడం ఏంటి అని పలువురు సోషల్ మీడియా వేదికగా ఫైరవుతున్నారు.

కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఈ విధంగా ట్వీట్ చేశారు. 'ఇది ఏమాత్రం కాల్పుల విరమణ ఒప్పందం కాదు. రాజోరి, ఆర్‌ఎస్ పుర, అక్నూర్, జమ్ము కశ్మీర్ నియంత్రణ రేఖ వెంబడి పేలుళ్ల శబ్ధాలు భారీగా వినిపించాయి. కాల్పుల విరమణ ఒప్పందం ఎక్కడ పోయింది..? శ్రీనగర్ అంతటా పేలుళ్లు శబ్దాలు వినిపించాయి' అని ఆయన ట్వీట్ చేశారు.

పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ నుంచి భారత్ ఆర్మీకి ఈరోజు మధ్యాహ్నం 3:35 గంటలకు కాల్ వచ్చిన విషయం తెలిసిందే. దాయాది పాకిస్థాన్ కోరిక మేరకే కాల్పుల విరమణ ఒప్పందానికి ఓకే చెప్పినట్టు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ధృవీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే విదేశాంగ కార్యదర్శి మిస్రి ఈ రోజు సాయంత్రం మీడియా సమావేశం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణను రెండు దేశాలు అంగీకరించినట్టు కూడా ఆయన తెలిపారు.

మీడియా సమావేశంలో మిస్రి మాట్లాడుతూ.. 'సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఇరుదేశాల డీజీఎంవోల మధ్య చర్చలు జరిగాయి. ఈ రోజు మధ్యాహ్నం 3:35 గంటలకు పాక్ డీజీఎంవో నుంచి భారత్ డీజీఎంవోకు ఫోన్ కాల్ వచ్చింది. ఇరుదేశాల మధ్య చర్చలు ఫలించినట్టు పాక్ మంత్రి ఇషాక్ దర్ ప్రకటించారు. ఈ క్రమంలోనే సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఈ నెల 12న ఇరు దేశాల మిలటరీ జనరల్ తదుపరి చర్చల గురించి మాట్లాడుకోనున్నారు' అని ఆయన వెల్లడించారు. అయితే ఇంతలోనే పాకిస్థాన్ తన వక్ర బుద్ధి చూపించకోవడం.. కశ్మీర్ లో కాల్పులకు పాల్పడడం ఏంటని భారతీయ పౌరులు రగిలిపోతున్నారు.



అయితే నిజంగా పాక్ కాల్పులకు పాల్పడిందా..? లేదా..? అనేది అధికార సమాచారం ద్వారా క్లారిటీ రావాల్సి ఉంది.

## మేం వ్యతిరేకం కాదు

- సీఎం ఆలోచనా విధానం మారాలి
- బీఆర్‌ఎస్ నేత కేపీ వివేకానంద

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

అందాల పోటీలకు బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ నేత కేపీ వివేకానంద స్పష్టం చేశారు. సైన్యం దేశ రక్షణ కోసం పోరాడుతున్న తీరు స్ఫూర్తిదాయకం అన్నారు. అందాల పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగాలని, యుద్ధ వాతావరణంలో కాదని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ పాలనలో రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. సలహాదారులు సీఎంకు ఏం సలహాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజల భయాందోళనలు నివృత్తి చేయాల్సిన సీఎం అందాల పోటీల బిజీలో ఉన్నారని ఆరోపించారు. అందాల పోటీలు రాష్ట్ర భవిష్యత్‌కు కీలకం అని చీఫ్ సెక్రెటరీ స్థాయి అధికారి మాట్లాడొచ్చా అని నిలదీశారు. సీఎం తెలంగాణ పరువును దిగజారుస్తున్నారని మండిపడ్డారు. పాలన అంటే చిన్న పిల్లల ఆటనా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అభినవ నీరో అని, ఆయన ఆలోచనా విధానం మారాలన్నారు.




## రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ రోజులు కొనసాగదు

- ఈ సర్కార్ కు తలా.., తోకలేదు
- తుగ్లక్ ప్రభుత్వం.., తుగ్లక్ సీఎం
- ఆయనో శాడిస్ట్, సైకో.. అందుకే ప్రజలను ఏడిపిస్తున్నావు
- గ్రౌండ్ రియాలిటీ తెప్పించుకుని సమస్యలు పరిష్కరించు
- ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**



రాష్ట్ర ప్రభుత్వానికి తలా తోకలేదని, తెలంగాణలో ఈ సర్కార్ ఇంకా ఎన్నో రోజులు కొనసాగదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి లోని పూజిత అపార్ట్మెంట్ నివాసులకు హైడ్రా నోటీసులు ఇవ్వడంతో బాధితులకు భరోసా కల్పించేందుకు ఆయన శనివారం అక్కడికి వెళ్లి మాట్లాడారు. అపార్ట్మెంట్ కూలగొడతామంటూ నోటీసులు ఇవ్వడంపై ఈటల ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది తుగ్లక్ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి ఓ తుగ్లక్ అంటూ విరుచుకుపడ్డారు. సీఎం.. ఒక శాడిస్ట్ అని, సైకో అని, అందుకే ప్రజలను ఏడిపిస్తున్నావంటూ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఉందని, గ్రౌండ్ రియాలిటీ ఏంటో సీఎం తెప్పించుకుని మాట్లాడి సమస్యలను పరిష్కరించారని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి తెలియకుండా ఏం జరుగుతున్నాయనే అంశాలై దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. ఇప్పటికైనా సిస్టంను బాగు చేసుకోవాలని సూచించారు. ప్రజల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ప్రజల జీవితాలతో ఆడుకున్న ఎవరూ బాగుపడడని శపించారు. నోటీసు ఇచ్చింది ఎమ్మార్వో అని, తాను కలెక్టర్ కు ఫోన్ చేస్తే తనకు తెలియదని చెప్పడమేంటని ఈటల ఫైరయ్యారు. ఇక్కడి ప్రజలు అన్ని అనుమతులతో ఇల్లు కట్టుకున్నారని, మరి పర్మిషన్స్ ఇచ్చేటప్పుడు అధికారుల బుద్ధి, జ్ఞానం ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజల బిల్డింగులు కూల్చివేయవచ్చని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రజలు పగ, కసితో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన సీతారామ ప్రాజెక్టు

- సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతంచేయాలి
- ప్రస్తుత డిజైన్ మేరకు ముందుకెళ్తాం
- అవసరమైన చోట లింక్ కెనాల్ తో పనులు చేపట్టాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ కృషితో నీటి కేటాయింపులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):** సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు సీతమ్మ సాగర్ ఆనకట్టను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సీతమ్మ సాగర్ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించామని, పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ లోని ఎర్రమంజిల్ కాలనీ జల సౌధ లో ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ సాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టు పురోగతి పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు అనుమతులు, పనుల పురోగతి, భూ సేకరణ, సంబంధిత అంశాలపై ఇంజనీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూడా హాజరయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతిపాదించిన తరహాలో ఇల్లెందు మీదుగా నీరు ఇస్తే జిల్లా మొత్తానికి ప్రయోజనకరంగా ఉంటుందని నర్సయ్య కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ సమస్యలు ఉంటే పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుత డిజైన్ ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. అవసరమైన చోట లింక్ కెనాల్ తో పనులు చేపట్టవచ్చని సూచించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సీతారామ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కృషితో నీటి కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు.



## కులగణనను ప్రజల్లోకి తీసుకెళ్తాం

- మోడీ ప్రధాన అయ్యాక ఓబీసీలకు ప్రాధాన్యత పెరిగింది
- కులగణనతోనే దేశాభివృద్ధి
- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్
- కులగణనను గత సర్కార్ పట్టించుకోలేదు
- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

కేంద్రం జనగణనతో పాటు కులగణన చేపడతానని నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని, ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ తెలిపారు. హైదరాబాద్ లోని ఒక హోటల్ లో శనివారం బ్యాక్ వర్డ్ క్లాసెస్ సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ (బీసీసీఈ) ఆధ్వర్యంలో 'కుల గణన ద్వారా ఓబీసీల భవిష్యత్ నిర్మాణం, సామాజిక న్యాయం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాగా ఈ సమావేశానికి చీఫ్ గెస్ట్ గా లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. మోదీ ప్రధాని అయ్యాక ఓబీసీలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఆర్ కృష్ణయ్య బీసీల కోసం జీవితాంతం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. కులగణనతోనే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. కులగణన దశాబ్దాలుగా చర్చనీయాంశంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పాకిస్థాన్ వక్ర బుద్ధితో దాడులు చేస్తోందని లక్ష్మణ్ ఫైరయ్యారు. భారతదేశ అభివృద్ధి ఎంజెండాతో ప్రధాని మోడీ పనిచేస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముందు ఉగ్రవాదుల దాడిలో అమరులైన సైనికులకు నివాళులర్పించి మౌనం పాటించారు.

రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కులగణన జరగాలని పోరాటం చేస్తుంటే గత ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదని విమర్శలు చేశారు. ఇప్పుడు కేంద్రం చేపడుతుంటే కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని విమర్శలు చేశారు. బీసీ ప్రధాని అయిన మోడీ బీసీల గొంతుకను గౌరవించి కులగణన చేపడుతున్నారని, దీనికి అందరూ మద్దతు తెలుపాలని, ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం తూళ్ళ వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. కులగణనను సమర్థవంతంగా నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో దేశ ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఐఏఎస్ పరికిపండ్ల నరహరి, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, నరగౌని గౌడ్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, సీఎల్‌ఎన్ గాంధీ, వివిధ రంగాల్లో నిష్ణాతులు, రాజ్యాంగ నిపుణులు, విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మట్టు పెట్టాల్సిందే..

**సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

ఉగ్రవాదులు ఏ మూలన ఉన్నా మట్టు పెట్టాల్సిందేనని, ఇందుకు వేరే ఆలోచనే అవసరం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషాతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. ఉగ్రవాదుల క్యాంపులపై దాడి క్రమంలో పాకిస్థాన్ సామాన్య జనాలకు ఇబ్బందులు కలిగించవద్దని మాత్రమే తాను మాట్లాడానని, తన వ్యాఖ్యలు వక్రీకరించారని, ఇది సరైంది కాదన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాది అయిన మాసుద్ అజర్‌ను భారత్ రప్పించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తుందనేది అపోహ మాత్రమేనని, ఇందుకు సంబంధించి ఆ దేశం అధికారికంగా స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రం చేపట్టనున్న కుల గణనను సీపీఐ పూర్తిగా స్వాగతిస్తున్నదని, ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కచ్చితమైన కాలపరిమితిని నిర్ణయించాలని కోరారు. తద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి కుల గణన ప్రక్రియను పూర్తి చేసి చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి వారు పోటీ చేసేందుకు అవకాశాన్ని కేంద్రం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించడం సిగ్గుచేటని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను అడ్డం పెట్టుకుని వ్యాపారం చేస్తారా? ఇది హీనాతి హీనమైందని పేర్కొన్నారు. ఈ పోటీల ద్వారా ప్రజలకు ప్రభుత్వం ఏమీ సందేశం ఇవ్వాలకుంటుందని నిలదీశారు.

## కార్యదర్శులే కీలకం

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

గ్రామ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని, మీ పనులు నిర్వహించేందుకు ప్రభుత్వంలో వేరే యంత్రాంగం లేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సరిహద్దుల్లో సైనికులు ఎలాగో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అలాగే ఉంటారన్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం పెద్ద అంబారిపేటలో శనివారం నిర్వహించారు. ఇందులో సీతక్కతోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదివాసీ బిడ్డకు పంచాయతీరాజ్ శాఖను కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి అప్పగించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తాను గ్రామాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నానన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు



జరగకపోవడం వల్ల కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశానుసారం కుల గణన చేపట్టామన్నారు. అందుకే పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యాయని వివరించారు. మీకు పని భారం పెరగడానికి గత ప్రభుత్వమే కారణమని, వీఆర్వో, వీవోల వ్యవస్థను కేసీఆర్ ఏకపక్షంగా రద్దు చేశారని మండిపడ్డారు. దీంతో మీపై పని ఒత్తిడి పెరిగిందని, ఆ భారాన్ని తగ్గించేందుకు గ్రామాల్లో పాలన అధికారులను నియమిస్తున్నామని సీతక్క స్పష్టం చేశారు.

## డ్రగ్స్‌తో పట్టుబడ్డ లేడీ డాక్టర్





- నాలుగేళ్లలో రూ.70 లక్షల ఖర్చు
- సప్లయర్ కూడా అరెస్ట్
- విచారణలో వెలుగులోకి సంచలన నిజాలు

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

వైద్యో నారాయణ హరి అంటారు. ప్రాణాలను కాపాడుతారు కాబట్టే వైద్యులకు దేవుని స్థానం ఇచ్చారు. అంతటి పవిత్ర వృత్తిలో ఉండి ఓ డాక్టర్ డ్రగ్స్‌కు బానిసగా మారింది. చివరకు పోలీసులకు పట్టుబడి కటకటాల వెనక్కి చేరింది. గమనించాల్సిన అంశం ఏమిటంటే గడిచిన నాలుగేళ్లలో మాదక ద్రవ్యాల కోసం ఈమె రూ.70 లక్షలు ఖర్చు చేసినట్టుగా సమాచారం.

**ఒమేగాలో సీఈవోగా పని చేస్తూ..**

గచ్చిబౌలిలోని ఒమేగా హాస్పిటల్‌లో డాక్టర్ చిగురుపాటి నమ్రత సీఈవోగా పని చేస్తోంది. నాలుగేళ్ల నుంచి డ్రగ్స్‌కు అలవాటు పడింది. ముంబైకు చెందిన వంశ్ టక్కర్ అనే వ్యక్తి నుంచి కొకైన్ తెప్పించుకుని సేవిస్తోంది. ఈ మేరకు సమాచారాన్ని సేకరించిన తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో అధికారులు నమ్రతపై నిఘా పెట్టారు. బాలకృష్ణ అనే వ్యక్తి 53 గ్రాముల కొకైన్‌ను ఆమెకు ఇస్తుండగా దాడి చేసి ఇద్దరిని పట్టుకున్నారు. మాదక ద్రవ్యాల నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి దర్యాప్తు నిమిత్తం రాయదుర్గం పోలీసులకు అప్పగించారు.

**వెలుగులోకి సంచలన విషయాలు**

నమ్రతను జరిపిన విచారణలో సంచలన వివరాలు వెలుగు చూశాయి. ముంబైకి చెందిన వంశ్ టక్కర్ హైదరాబాద్‌తోపాటు దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న వారికి కొన్నేళ్లుగా డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నట్టుగా తేలింది. దీని కోసం డ్రగ్స్ వినియోగిస్తున్న వారితో అతను ఏకంగా ఓ వాట్సాప్ గ్రూప్‌నే పెట్టినట్టుగా వెల్లడైంది. వాట్సాప్ నుంచి ఆర్డర్లు తీసుకుని ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు జరిపించుకొని వంశ్ టక్కర్ కొకైన్ సరఫరా చేస్తున్నట్టుగా తెలిసింది. నాలుగేళ్ల క్రితం ఓ పార్టీలో అతనితో నమ్రతకు పరిచయం ఏర్పడినట్టుగా తెలియవచ్చింది.

**గ్రూప్ సభ్యుల వివరాలు**

డ్రగ్ కొనుగోలుదారుల కోసం వంశ్ టక్కర్ పెట్టిన వాట్సాప్ గ్రూప్‌లో నమ్రత సభ్యురాలిగా ఉన్న నేపథ్యంలో పోలీసులు ఆమె మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. ఈ గ్రూప్‌లో ఇంకా ఎవరెవరు సభ్యులుగా ఉన్నారనే వివరాలను తెలుసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం బడా వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల కుటుంబాలకు చెందిన కొంతమంది ఈ వాట్సాప్ గ్రూప్‌లో సభ్యులుగా ఉన్నట్టుగా తెలిసింది. వీరందరినీ ఒక్కొక్కరిగా పిలిపించి ప్రశ్నించాలని యాంటీ నార్కొటిక్ బ్యూరో అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

# లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇరిగేషన్ ఇంజనీర్



**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):** రాజన్న సిరిసిల్ల ఇరిగేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అర్రామ్ రెడ్డి అమరేందర్ రెడ్డిని కరీంనగర్‌లోని తన నివాసంలో ఫిర్యాదుదారుడి నుండి రూ.60,000 లంచం తీసుకుంటూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకటాపూర్ మండలం అవునూరు, అగ్రరం గ్రామాల మధ్య చెక్ డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన రూ.50 లక్షల బిల్లును మంజూరు చేయడానికి అధికారిక అనుకూలంగా చూపించినందుకు ఫిర్యాదుదారుడి నుండి లంచం తీసుకున్నారు. ఈ నిర్మాణ పనులను ఫిర్యాదుదారు ఒక సంవత్సరం క్రితం పూర్తి చేశారు. ఏసీబీ అధికారులు రావడం గమనించిన అమరేందర్ రెడ్డి లంచం డబ్బును తన కొడుకు టీషర్టులో ముట్టుకోకుండా చుట్టి ఇంటి కాంపౌండ్ గోడ వెలుపల విసిరారు. రెడ్డి నివాసం వెనుక ఉన్న బహిరంగ స్థలం నుండి రూ.60,000 లంచం మొత్తాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లంచం మొత్తంతో సంబంధంలోకి వచ్చిన టీషర్టు భాగం రసాయన పరీక్షలో పాజిటివ్‌గా తేలింది. ఏసీబీ అధికారులు మాట్లాడుతూ.. అర్రామ్ రెడ్డి అమరేందర్ రెడ్డి తన విధిని సక్రమంగా, నిజాయితీ లేకుండా నిర్వర్తించి, అనవసర ప్రయోజనం పొందారని అన్నారు. ఫిర్యాదుదారుడు గతంలో సమర్పించిన బిల్లును మంజూరు చేయడానికి రెడ్డి ఇప్పటికే రూ.4 లక్షలు తీసుకున్నాడు. కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన మిగిలిన బిల్లును మంజూరు చేయడానికి మళ్లీ రూ.75,000 లంచం డిమాండ్ చేశాడు. రెడ్డిని కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ లేదా దాని అధికారిక వెబ్‌సైట్‌ను ఉపయోగించి ఏసీబీ తెలంగాణను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

# పేద విద్యార్థి ఫీజుకి వాసుపల్లి రూ.10 వేలు ఆర్థిక సాయం

- వైఎస్ఆర్సిపి పార్టీ ఆఫీస్ ఆయాకి వాసుపల్లి చేయూత
- సింధూర్ లో వీరనారీల విశ్వరూపం అభినంద నీయం
- ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెటరన్ ఫ్లైట్ లెఫ్ట్నెంట్,మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖపట్నం,మే 10(ప్రజాక్షేత్రం ):** దక్షిణ నియోజకవర్గ ప్రజలకు కష్టాల్లో కనబడే ఒకే ఒక్క ప్రజానాయకుడు మాజీ ఎమ్మెల్యే,ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెటరన్ ఫ్లైట్ లెఫ్ట్నెంట్ వాసుపల్లి గణేష్ కుమార్. నిర్విరామంగా తాను చేస్తున్న ఆర్థిక సహాయం లో భాగంగా వైయస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయా మీసాల సంధ్య కుమార్తె మీసాల హాసిని కళాశాల ఫీజు నిమిత్తం రూ.10,000 సొంత నగదును అందజేశారు.30వ వార్డు రెల్లి వీధి కుంచమాంబ గుడి వద్ద నివాసం ఉంటున్న ఆ పేద కుటుంబానికి ఆసీలమెట్ట పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా వాసుపల్లి మీసాల హాసినీ తో మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని దీవించారు.నేడు మన దేశంలో పురుషులకు మించి మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించడంలో ముందుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు.మంగళవారం ఆపరేషన్ సింధూర పేరిట జరిగిన యుద్ధంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలను మన వీరనారీలు ధ్వంసం చేసారు. భాగంగా పాకిస్తాన్ లో హాఫీజ్ కుటుంబాన్ని 98 మంది ఉగ్రవాదులను మట్టు పెట్టడంలో మన వీరనారీలు కల్నల్ సోఫియా ఖురేషి, వ్యోమిక సింగ్ కనకదుర్గ అమ్మవారిలా విశ్వరూపం చూపారన్నారు.బుల్లెట్ కి బుల్లెట్ తోనే సమాధానం ఇవ్వడం సరైన నిర్ణయం అని వాసుపల్లి అన్నారు. మన ఎస్ 400 సుదర్శన్ చక్రంలో భారతదేశం వైపు పాకిస్తాన్ చేస్తున్న దొంగదెబ్బను అడ్డుకోవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని అన్నారు. మహిళలు అయినప్పటికీ ఎంతో ధైర్యంగా పాకిస్తాన్ ఉగ్రవాదులను,వారి శిబిరాలను తునా తునకలు చేశారన్నారు.దొంగ దెబ్బ తీస్తున్న పాకిస్తాన్ కు దిమ్మతిరిగే విధంగా మన సైనికులు దిమ్మతిరిగే షాక్ ఇస్తున్నారన్నారు.కల్నల్ సోఫియా ఖురేషి,వ్యోమికా సింగ్ లాంటి వారిని విద్యార్థినిలు,మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వీరమరణం పొందిన మన తెలుగు జవాన్ మురళి నాయక్ కి అశ్రునివాళులు అర్పిస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా జవాన్ మురళి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.ఇప్పటికే భారతదేశానికి అన్ని ప్రపంచ దేశాల మద్దతు ఉందన్నారు. ఇదే సమయంగా పాకిస్తాను ప్రపంచ పటంలోనే లేనివిధంగా గట్టి దాడి చేయాలన్నారు. సింధూ నది నీళ్లు ఆపడం ఆహార కొరత ఇప్పటికే పాకిస్తాన్ కి ఏ దేశం కూడా సాయం చెయ్యకపోయినప్పటికీ పాకిస్తాన్ దొంగ దాడులు చేస్తోందన్నారు.కాశ్మీర్లో ఆక్రమించుకున్న భూభాగాన్ని మొత్తం భారతదేశం కైవసం చేసుకోవాలన్నారు.ఆపరేషన్ సింధూర్ స్ట్రైక్ లో టాప్ 5 ఉగ్రవాదులను భారత్ హతం చేయగలిగిందన్నారు.యుద్ధం పూర్తి స్థాయిలో జరిగితే పాకిస్తాన్ ప్రపంచ పటంలోనే లేకుండా చేయడానికి మన సైనికులు సిద్ధంగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో దక్షిణ వార్డు ప్రెసిడెంట్లు వైసిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## గ్రామీణ ఉపాధి హామీ పథకం పై దేగాం లో గ్రామసభ

**నిజామాబాద్,మే 10(ప్రజాక్షేత్రం):** ఆలూర్ మండలం దేగాం గ్రామంలో ఒక సంవత్సరంకుగాను సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల యొక్క సామాజిక తనిఖీకి సంబంధించి పంచాయతీ ఆవరణలో శనివారం గ్రామసభ నిర్వహించడం జరిగింది.ఉపాధి హామీ పథకంపై నియమ నిబంధనలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో జిపి స్పెషల్ ఆఫీసర్ రాంబాబు,పంచాయతీ కార్యదర్శి కూర శ్రీనివాస్, పి ఆర్ ఏ ఈ నితీష్,ఉపాధి హామీ పథకం సిబ్బంది,ఆడిట్ అధికారులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## కమ్యూనిస్టు ఉద్యమ నేత మద్దికాయల ఓంకార్

**ఎం సి పి ఐ యు పార్టీ డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్.**

**దుగ్గొండి మండలం,మే10, (ప్రజాక్షేత్రం):** మండలం లోని రేబల్లె గ్రామం ఎం సి పి ఐ యు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి అసెంబ్లీ టైగర్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ ప్రారంభ సభకు సంబంధించిన వార్ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా హాజరైన పార్టీ డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్ మాట్లాడుతూ అమరజీవి ఓంకార్ బలహీన వర్గాలను ఏకం చేసి నాటి నైజాం నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను చేసి,ప్రజల గుండెల్లో కమ్యూనిస్టు ఉద్యమ నేతగా,అసెంబ్లీ టైగర్ గా ప్రఖ్యాతిగాంచారని వారి సేవలను కొనియాడారు.మే 12వ తేదీన మచ్చాపూర్ లో గల ఓంకార్ స్మారక స్థూపం వద్ద వారి శతజయంతి వార్షికోత్సవ ప్రారంభ సభ ఉంటుందని,ఈ సభను విజయవంతం చేయడానికి విద్యార్థులు,యువకులు, మేధావులు కదలి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గటికె. కోటేశ్వర్,సిరిబొమ్మలభాస్కర్, పేరబోయిన ఐలోని, కొమురయ్య,మొగిలి,లాల్ మహమ్మద్ చంద్రరావు,అక్బర్,బాబురావు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యకు ఘనంగా సన్మానం

**చౌటుప్పల్,మే 10(ప్రజాక్షేత్రం):** చౌటుప్పల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన ఉబ్బు వెంకటయ్య కి, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి కి, మరియు పాలకవర్గ సభ్యులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ పాల్గొని నూతన పాలకవర్గానికి స్వీట్లు తినిపించి శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది.అనంతరం మాట్లాడుతూ నూతన పాలకవర్గా సభ్యులకు మాదిగ దండోరా ఎమ్మార్పీఎస్ పక్షాన హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గుడ్డేటి యాదయ్య,బక్క శ్రీనాథ్, కొయ్యలగూడెం గ్రామ ప్రైమరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు మేడి యాదయ్య,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బోయ రాము, ఎమ్మార్పీఎస్ నాయకులు తూర్పుంటి యాదయ్య, చింతల సాయిలు,లందగిరి భీమయ్య,మాదిగ జర్నలిస్ట్ పోరం మండల అధ్యక్షులు ఆరుట్ల లింగస్వామి, ఎమ్మార్పీఎస్ మున్సిపల్ అధ్యక్షులు ఎర్ర శంకర్, మండల ఉపాధ్యక్షులు చీమకండ్ల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి ఎర్ర గౌతం, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు దొనకొండ కృష్ణ, చెంచల శ్రీనివాస్,గ్యార సుధాకర్,ఉదరి యాదయ్య, బొడ్డు పరమేష్,ఉదరి నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# మాల మహానాడు ఆధ్వర్యంలో పివి రావు 73వ జయంతి

**వలిగొండ,మే 10(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండల కేంద్రంలో శనివారం రోజున మాల మహానాడు వ్యవస్థాపకులు పివి రావు 73వ జయంతిని మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా నాయకులు మామిళ్ళ రత్నయ్య మాట్లాడుతూ తన ఉద్యోగానికి రాజీనామా చేసి మాలల కోసం పోరాడిన మహనీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెరమండ్ల యాదగిరి,మాల మహానాడు నాయకులు నీలంనరేందర్,రాపోలు పవన్ కుమార్,మండల కార్యదర్శి కాశమల్ల శేఖర్,వాళ్ళ వలమల్లరత్నయ్య,కట్ట సురేష్ ,బోడ విజయకుమార్,బందెల భిక్షం, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ ప్రగతిచక్రం అవార్డులు అందుకున్న నర్సంపేట డిపో ఉద్యోగులు.

**ఉద్యోగస్తులను అభినంధించిన డిపో మేనేజర్**

**నర్సంపేట,మే10(ప్రజాక్షేత్రం):** శనివారం రోజున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వరంగల్ రిజియన్ మేనేజర్ విజయభాను ఆధ్వర్యంలో నాల్గవ త్రైమాసిక ప్రగతి చక్రం అవార్డుల కార్యక్రమం తొర్రూర్ డిపో లో నిర్వహించడం జరిగింది. నర్సంపేట డిపో కి చెందిన ఉద్యోగులు హరిసింగ్, ఎన్ ఎన్ రావ్, ఎస్ ఎస్ పాణి,పి వి రావ్,మహేష్ లు ఇందన పొదుపు మరియు ఎక్కువ ఆదాయం తీసుకువచ్చి డిపో ఆధాయానికి కృషి చేసినందుకు ఆర్ ఎం మెమెంటో క్యాష్ అవార్డు అందజేశారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీగ మాట్లాడుతూ అవార్డులు అందుకున్న నర్సంపేట డిపో ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు తెలియజేసి మిగతా ఉద్యోగులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వరంగల్ డిప్యూటీ ఆర్ ఎం (ఓ &ఏం)భానుకిరణ్,మహేష్ కుమార్,నర్సంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, ఎం ఎఫ్ ప్రభాకర్,సేఫ్టీ వార్డెన్ బాబు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ లో కాస్మోటాలజీ, న్యూట్రిషన్ లో పీజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు స్వీకరణ.

**విశాఖపట్నం,మే 10(ప్రజాక్షేత్రం):** విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో కలిసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.స్వస్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ నుండి కాస్మోటాలజీ,పారామెడికల్ సైన్సెస్ లో కీలకమైన కెరీర్ అవకాశాల గురించి అవగాహన కల్పించడంతో పాటు కాస్మోటాలజీ,డైట్ అండ్ న్యూట్రిషన్ లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులను అందించడానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో ముఖ్యమైన విద్యా సహకారాన్ని ప్రకటించడం లక్ష్యంగా కోర్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆరోగ్య సంరక్షణ,వెల్నెస్,సౌందర్యం వంటి అంశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలుగా కొనసాగుతున్నందున, వృత్తిపరంగా శిక్షణ,సర్టిఫైడ్ విద్యార్థులకు అధిక డిమాండ్ ఉందన్నారు.ఆశావహులైన నిపుణులు బలమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న కెరీర్‌లను నిర్మించడంలో సహాయపడటానికి అధికనాణ్యత,ఆచరణాత్మక విద్యను అందించడం లక్ష్యంగా కోర్సులు నేర్పిస్తున్నామని చెప్పారు. అకడమిక్ ఎక్సలెన్స్, అత్యాధునిక పరిశోధనలు, సమగ్ర ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ హెల్త్‌కేర్ సేవల ద్వారా స్థిరమైన ఆరోగ్య పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యమని రాజీవ్ అన్నారు.స్వస్థ గుర్తింపు పొందిన సంస్థల నుండి అక్రిడిటేషన్లను కొనసాగిస్తోందన్నారు. దాని ప్రభావాన్ని విస్తరించడానికి విద్యా, ఆరోగ్య సంరక్షణ సంస్థలతో సహకారాన్ని ఏర్పరుస్తుందన్నారు. మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ హరిత మాట్లాడుతూ స్వస్థ సుచన్,ఆరోగ్య సంరక్షణ, విద్య,పరిశోధనలకు సమగ్ర విధానం ద్వారా సమాజ శ్రేయస్సును పెంపొందించడానికి అంకితమైన సంస్థగా పనిచేస్తుందన్నారు.సంస్థ దృష్టి, విజయాలు భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. స్వస్థ సుచన్ విస్తృత సేవలను వివరిస్తూ టెలిమెడిసిన్ అందిస్తామన్నారు.వ్యక్తి సంరక్షణ,జీవనశైలి రుగ్మత నిర్వహణ కార్యక్రమాలను అందిస్తామన్నారు.స్వస్థ సుచన్ హెల్త్‌కేర్,యోగా థెరపీ, ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో సర్టిఫికేట్ డిప్లొమా కోర్సులను కూడా అందిస్తున్నామన్నారు. డాక్టర్ అనంత మాట్లాడుతూ క్లినికల్ కాస్మోటాలజీ,సౌందర్య చికిత్సలు,అధునాతన హెయిర్ డిజైన్‌లో కోర్సులు పరిశ్రమ అవసరాలను తీరుస్తాయన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం సహకారం పాఠ్యాంశాల అభివృద్ధి, ఫ్యాకల్టీ మార్పిడి ,ఇంటర్న్‌షిప్ అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆయన వివరించారు.



## ఘనంగా చింతలపూడి శాసనసభ్యులు సంఘ రోషన్ కుమార్ జన్మదిన వేడుకలు

**ఏలూరు జిల్లా,మే 10 (ప్రజాక్షేత్రం):** ఏలూరు జిల్లా మండలంలోని నాయకులు నందిగం బాబి ఆధ్వర్యంలో చింతలపూడి శాసన సభ్యులు సొంగ రోషన్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని భగవంతుడు ఆయనకి మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకున్నారు.వీరితో ముసునూరి రాము కూరపాటి రత్తయ్య నందిగం శ్రీధర్ బొల్లినేని సుధా ఉన్నారు. అనంతరం వీరు చింతలపూడి వేడుకలు జరుగుతున్న మార్కెట్ యార్డుకు చేరుకొని రోషన్ కుమార్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.




## పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఐలయ్య యాదవ్

**నారాయణపురం,మే 10(ప్రజాక్షేత్రం):** మునుగోడు మండల పరిధిలోని కోతులారం గ్రామంలో జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ కేదారేశ్వర స్వామి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ కలిశారు.ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఐలయ్య యాదవ్ తో పాటు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ,డీసీసీ కార్యదర్శి నోముల మాధవ రెడ్డి,డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఏర్పుల సుదర్శన్ తదితరులు ఉన్నారు.





## పివి రావు ఆశయ సాధన కోసం మాలలు కృషి చేయాలి

**మాల మహానాడు మండల అధ్యక్షులు జువ్వి నరసింహ**

**చౌటుప్పల్,మే 10(ప్రజాక్షేత్రం):**పివి రావు ఆశయ సాధన కోసం మాలలు కృషి చేయాలని మాల మహానాడు చౌటుప్పల మండల అధ్యక్షులు జువ్వి నరసింహ కోరారు.మాల మహానాడు వ్యవస్థాపకులు స్వర్గీయ పివి రావు 73వ జయంతిని శనివారం చౌటుప్పల్ మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ముందు పివి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జువ్వి నరసింహ మాట్లాడుతూ జీవితాంతం మాలల అభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప నేత పీవీ రావు అని కొనియాడారు రాజ్యాంగ విరుద్ధంగా అప్పటి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తే పివి రావు నాయకత్వం లో అనేక పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు.మాలల కోసం పీవీ రావు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల ప్రధాన కార్యదర్శి సంగం నర్సింగరావు,నాయకులు జువ్వి రఘుపతి ,కట్ట శంకరయ్య,గోలి స్వామి నామ బాలరాజు,జువ్వి శివ, వల్లబోతు భాస్కర్,సుంకరి హరినాథ్,మనే కుమారస్వామి,నామ సురేష్, ఈసం మహేష్,అనిమల్ యాదయ్య కట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## రహీమ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కైసర్ జన్మదిన వేడుకలు

**నారాయణపురం,మే 10(ప్రజాక్షేత్రం):**సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్ జన్మదిన వేడుకలను మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు ఎండీ రహీం షరీఫ్ ఆధ్వర్యంలో శాలువ కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపి కేకు కట్ చేయడం జరిగింది.అనంతరం రహీమ్ షరీఫ్ మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలి అని అష్ట ఐశ్వర్య ఆయురారోగ్యాలతో జీవిత కాలం సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.ఈ వేడుకల్లో యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు అందె నరేష్ యాదవ్,పత్రిక విలేకరి డాక్టర్ దువ్వ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని మాధవధారలో ఎమ్మెల్యే పూజలు

**మాధవధార,మే 10(ప్రజాక్షేత్రం):**

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని మాధవధార కుంచుమాంబ అమ్మవారి ఆలయంలో నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శనివారం పూజలు చేశారు.ఆయనకు 50వ వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ స్వాగతం పలికారు. భారత సైనికులు,ప్రజలు క్షేమంగా ఉండాలని పూజలు చేశారు.ఉగ్రవాదాన్ని పోషిస్తూ భారతదేశంలోని అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటున్న పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.దేశ భద్రత కోసం సరిహద్దులలో పోరాడుతున్న భారతీయ సైనికులు క్షేమంగా ఉండాలని వరప్రసాద్ కొబ్బరి కాయలు కొట్టారు.కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ సురేష్ బాబు,51వ బిజెపి అధ్యక్షులు తమ్మినేని పద్మజ, 51వ వార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి,తాతినేని శ్రీనివాస్,కిల్లి శ్రీరామ్మూర్తి,దిలీప్ రాజు,సనపల నరసింహస్వామి, రామరాజ్యం,మూల వెంకట్రావు,దవళకుమారి, శాంతి,సనపల నాగచంద్రుడు, ఉదంతరావు,సనపల నారాయణస్వామి,పొన్నాడ రాంబాబు,కూటమి నాయకులు ఉన్నారు.



## చలివేంద్రం కుండలలో స్వచ్ఛందంగా నీరు పోస్తున్న సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్.

**శంకర్ పల్లి మే 10(ప్రజాక్షేత్రం):**

వారం రోజుల క్రితం శంకర్ పల్లి రైల్వే స్టేషన్ లో స్వర్గీయ ఎం. నరసింహ స్వామి(సీనియర్ పాత్రికేయులు) స్వర్గీయ మొనాచారి జ్ఞాపకార్థం శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్, ఫౌండేషన్ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా ప్రతిరోజు నీటి సరఫరా చేసే వ్యక్తి శనివారం లేనందున సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు స్వయంగా తాగునీటిని ఆటో లో రైల్వే స్టేషన్ వద్దకు తీసుకెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన కుండలలో స్వయంగా నీటిని పోశారు. ప్రతి ఒక్కరికి త్రాగునీరు అందాలనే ఉద్దేశంతో రైల్వేస్టేషన్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని నరేష్ కుమార్ తెలిపారు.



# రాజకీయ ప్రయోజనాల కోసమే కులా మతాలను పెంచి పోషిస్తున్నారు

- మత విద్వేషాలను రెచ్చగొడుతున్న మతోన్మాదులారా ఖబర్దార్
- బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య
- సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**చేవెళ్ల మే 10(ప్రజాక్షేత్రం):**కులం సామాజికం మతంవ్యక్తిగతం మతసామరస్యం పౌరుల బాధ్యత అనే అంశంపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా బికెఎంయు జిల్లా అధ్యక్షులు జే అంజయ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సెమినార్ చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో అధికారిక లెక్కల ప్రకారం 3000 కులాలు ఉన్నాయి 25 000 ఉప కులాలు ఉన్నాయని 8 మతాలు ఉన్నాయని అందులో నూటికి ఎనభై శాతం మంది హిందూ మతం విశ్వసిస్తున్నారని తెలిపారు కులాలు మతాలు రాజకీయ ప్రయోజనాల కోసం అధికార దాహం కోసం పుట్టినవి అని అన్నారు. ఈ సెమినార్ కు ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య లు మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం కులమతాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని వారు మండిపడ్డారు ఇలాంటి దగులు బాజీ రాజకీయాలు చెయ్యడం అనేది సరైనది కాదు అని దుయ్యబట్టారు భారతదేశ సమాజంలో పుట్టిన ప్రజలకు వృత్తులను బట్టి మను ధర్మ శాస్త్రం ప్రకారం నాలుగు వర్ణాలుగా విభజించి బ్రాహ్మణులు తలలో నుంచి పుట్టారని వైశ్యులు భుజాల నుంచి పుట్టారని క్షత్రియులు తొడల నుంచి పుట్టారని శూద్రులు పాదాల నుంచి పుట్టారని తలా తోక లేని రాతలు రాసి భారత ప్రజలపై వృద్ధారని ఎవరైనా తల్లి కడుపులోనుంచి పుడతారు కానీ ఇలా మనిషి అవయవాలనుంచి పుట్టారని అది గుర్తెరగాలని వారు తెలియజేశారు. వర్ణాల నుంచి వృత్తులను బట్టి కులాలను అంటగట్టారని వృత్తులన్నీ పొయ్యాయి అన్నికులాలవారు అన్యవృత్తులను చేస్తున్నారు అయిన కులాలు పోలేదు ఈ కుల పీడన ప్రజలను పట్టిపీడిస్తున్న పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కులం మతం సమస్యలతో ప్రజలు అభివృద్ధికి నోచుకోలేకపోతున్నారని చదువు కావచ్చు సామాజిక గౌరవంగా వచ్చు ఆర్థిక అభివృద్ధి కావచ్చు దేనిలో కూడా పేద ప్రజలను అభివృద్ధి వైపు పాలక ప్రభుత్వాలు నడిపిస్తలేవని వారు ఆరోపించారు నేటికీ గ్రామాలలో గుల్లోకిరానియని పరిస్థితులు కూడా ఉన్నాయి దేశానికి స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాల అవుతుంటే మనకు రాజ్యాంగమల్లె 75 సంవత్సరాలు అవుతుంటే నేటికీ కులవివక్ష అంటరానితనం గ్రామాలలో రాజమేలుతున్న పరిస్థితులున్నా అంటే దీనికి కారణం పాలక ప్రభుత్వాలు అనిఅన్నారు మతం మత విశ్వాసం వ్యక్తిగతమని ఎవరి మతాలు వారి సాంప్రదాయాల ప్రకారం పాటించుకోవచ్చని భారత రాజ్యాంగమే చెబుతుందని కానీ మతాల మధ్యలో చిచ్చులు పెట్టి మతపరమైన దాడులు జరుగుతున్నాయని దానికి కారణం మతవిద్వేషాలని రెచ్చగొట్టే రాజకీయ నాయకులు అని ఇలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది కానీ చట్టంలో ఉన్న లొసుగులను అడ్డం పెట్టుకొని బయట దర్జాగా తిరుగుతున్నారని మండిపడ్డారు ఇకనైనా యావత్ ప్రజానికం మతసామరస్యాన్ని పాటించి అందరూ కలిసిమెలిసి ఉండాల్సిందిగా వారు ప్రజానీకానికి పిలుపునిచ్చారు. కుల పరమైన మతపరమైన ఎలాంటి సంఘటనైన ప్రతిఘటించి ఎదుర్కొని ప్రజలకు అండగా ఉండి పోరాడుతున్న పార్టీ ఏదైనా ఉందంటే అది సిపిఐ ప్రజాసంఘాలే నని వారు అన్నారు. ఇకనైనా పాలక ప్రభుత్వాలు పేద ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి ఆర్థిక అసమానతల పోగొట్టే విధంగా పథకాలను పేదలకు అందే విధంగా కూడు గూడు విద్య వైద్యంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని వారు పాలక ప్రభుత్వాల డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే రామస్వామి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ప్రభు లింగం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ మహిళా సమైక్య జిల్లా కార్యనిర్వాక అధ్యక్షురాలు వడ్ల మంజుల ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి మక్బూల్ సిపిఐ మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి కే శ్రీనివాస్ సుదీర్ నక్క జంగయ్య భాగాల నరసింహ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వరూప యశోద రాములు తదితరులు పాల్గొన్నారు.







## కూటమి గౌరవ సభలో కౌరవుడు పల్లా శ్రీనివాస్

- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ సంచలన ఆరోపణ
- నారా లోకేష్ అండగా ఉన్నారనే భ్రమలో పల్లా అండ్ కో చెలరేగి పోతున్నారు
- అక్రమార్కులను నారా లోకేష్ దూరంగా ఉంచుతారు
- ఒకవేళ అక్రమార్కులను ప్రోత్సహిస్తే లోకేష్ పై యుద్ధానికి "తెలుగు శక్తి" వెనకాడదు
- మీడియా సమావేశంలో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ స్పష్టీకరణ

**విశాఖపట్నం,మే 10(ప్రజాక్షేత్రం):**


వైసీపీ దుర్మార్గపు పాలనలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు శాసనసభలో మాట్లాడుతూ.. ఇది గౌరవ సభ కాదు కౌరవ సభ అని ఆందోళన వ్యక్తం చేశారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ గుర్తు చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్న గౌరవ సభలో కూడా ఒక కౌరవుడు ఉన్నారని.ఆ కౌరవుడు మరెవరో కాదు ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అని సంచలనాత్మకమైన ఆరోపణ చేశారు.నగరంలోని బీచ్ రోడ్ లో శనివారం మధ్యాహ్నం హోటల్ అంబికా శ్రీ గ్రీన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి కోవర్టుగా వ్యవహరిస్తూ గాజువాకలో అరాచకాలను సృష్టిస్తున్న పల్లా శ్రీనివాస్ దురాగతాలపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందఅన్నారు.పార్టీ అధ్యక్ష స్థానం నుంచి,పార్టీ నుంచి కూడా పల్లాను తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.పల్లాతో పాటు అతని అనుచరులు తమ వెనుక నారా లోకేష్ ఉన్నారని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. తనకు తెలిసినంతవరకు అరాచకాలు,అన్యాయాలకు పాల్పడే వారిని నారా లోకేష్ ఎంత మాత్రం ప్రోత్సహించరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒకవేళ నారా లోకేష్ కూడా అక్రమార్కులకు కొమ్ము కాస్తే అతనిపై కూడా తెలుగు శక్తి యుద్ధం చేసేందుకు వెనుకాడదని పేర్కొన్నారు. తెలుగు శక్తి ఎప్పుడూ కూడా ప్రజల వెంటే ఉంటుందని, అక్రమాలను అన్యాయాలను ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదని ప్రజల సమస్యల పరిష్కారమే ముఖ్యమని పేర్కొన్నారు.

**త్వరలోనే బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్**

తమ దివంగత తండ్రి బి.వి.రామారావు ఆశయ సాధన లక్ష్యంగా బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపిస్తానని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ప్రకటించారు. తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడు సమైఖ్య ఆంధ్రప్రదేశ్ కు రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అన్న నందమూరి తారక రామారావు జయంతి రోజున బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ప్రారంభిస్తా మని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకురాలు కే.రత్నకుమారి, వేగి రాధాకృష్ణ, డాక్టర్ కె సురేష్ బాబు, వి.వంశీ బాబు, కే.పరమేష్,పి.లోకేష్,పీతల అప్పారావు,అంబర్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీయాస్ బ్యూటీ అకాడమీలో ఉచిత బ్యూటీషియన్ ట్రైనింగ్ వర్క్‌షాప్

**శంకర్ పల్లి మే 10(ప్రజాక్షేత్రం):**ఈనెల 12, 13, 14 తేదీలలో శ్రీయాస్ బ్యూటీ అకాడమీ, బోయిన్‌పల్లి బ్రాంచ్ లో ఉచిత బ్యూటీషియన్ ట్రైనింగ్ వర్క్‌షాప్ కార్యక్రమం ఉంటుందని అకాడమీ సీఈఓ శ్రీలత గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీలత గౌడ్ మాట్లాడుతూ సమయం ఉదయం గం. 11 నుంచి మధ్యాహ్నం గం. 2 వరకు వర్క్ షాప్ ఉంటుందని, ట్రైనింగ్ తీసుకున్న వారికి సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు 3 నెలల ఇంటర్న్‌షిప్ మణికొండ, సుచిత్రా, కొంపల్లి, బోయిన్‌పల్లి బ్రాంచ్‌లలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. చివరి నమోదు మే 11 వ తేదీ వరకు అని తెలియజేశారు. స్థలాలు పరిమితంగా ఉన్నాయని, ఇప్పుడే రిజిస్టర్ చేసుకోండని శ్రీలత గౌడ్ పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్ ను (9989610703) సంప్రదించాలని కోరారు.





## ఫిజికల్ డైరెక్టర్ల సమస్యలు పరిష్కరించండి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 10 (ప్రజాక్షేత్రం):**మోడల్ స్కూల్, పీడీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని శనివారం మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు, ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు ను కలిసి మోడల్ స్కూల్లో ఫిజికల్ డైరెక్టర్ గా 12 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేదని మొరపెట్టుకున్నారు. అదేవిధంగా సకాలంలో వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 234 జీవో ప్రకారం న్యాయం చేయాలని ఆయనను కోరారు, వారి సమస్యలను విన్న ఆయన సానుకూలంగా స్పందించి అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించే విధంగా చేస్తానని హామీ ఇచ్చినట్లు ఫిజికల్ డైరెక్టర్ రా బృందం తెలిపింది, ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సతీష్, తదితరులు పాల్గొన్నారు

## స్టేషన్ సిబ్బందికి హెల్మెట్లు బహుకరించిన ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా ఆర్మీ

**ప్రత్తిపాడు,మే 10(ప్రజాక్షేత్రం):**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రోడ్డు భద్రతా నియమాల్లో భాగంగా వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీస్ శాఖాధికారులు పదేపదే ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో స్టేషన్ సిబ్బందికి రక్షణ కవచంలా ఉండాలనే సదుద్దేశంతో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సైనికులు,కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల నాని,యువ నాయకులు అంబటి బుజ్జి,గోపిశెట్టి శ్రీను,కార్మిక నాయకుడు పత్రి రమణల ఆధ్వర్యంలో ఎస్సై ఎస్ లక్ష్మి కాంతం చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి హెల్మెట్లు బహుకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం అనేక కేసుల నిమిత్తం స్టేషన్ సిబ్బంది మండలంలో ఉన్న గ్రామాలు తిరగాల్సి ఉంటుందని,విపరీతమైన ఎండలు కాస్తున్న నేపథ్యంలో అన్ని కాలాల్లో కూడా రక్షణ కల్పించే వారి శిరస్సుకి రక్షణగా ఉండాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముత్యాల రాంబాబు,జనసేన యువనాయకులు పి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## 42 ట్రాక్టర్ లతో గోమాతలకు ఉచిత పశుగ్రాసం అందజేత.

**సుల్తానాబాద్,మే 10(ప్రజాక్షేత్రం):**తెలంగాణ రాష్ట్రంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గల గోమాతలకు 42 ట్రాక్టర్లతో ఉచితంగా పశుగ్రాసం అందజేశారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల,మారుతి నగర్, రాముని పల్లి ప్రాంత ప్రజలు జానకి రామ ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 42 ట్రాక్టర్లతో వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయలంలోని గోమాతలకు ఉచితంగా పశుగ్రాసాన్ని తరలించినట్లు ట్రాక్టర్స్ ఓనర్స్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జానకిరామ ట్రాక్టర్స్ ఓనర్స్ మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వర స్వామి గోమాతలకు ఉచితంగా పశుగ్రాసాన్ని అందజేయడం మాకు ఎంతో అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కనుకుల, రామునిపల్లి, మారుతినగర్ ప్రాంత ట్రాక్టర్స్ ఓనర్స్, డ్రైవర్స్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మోదీ గారూ, పాకిస్థాన్‌ను ప్రపంచ పటంలో లేకుండా చేయండి

- **పాకిస్థాన్‌పై మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు**
- **మల్లారెడ్డి యూనివర్సిటీలో సైన్యానికి మద్దతుగా 'ఆపరేషన్ సిందూర్' పేరిట ర్యాలీ**
- **కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే వివేకానంద**
- **పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని మల్లారెడ్డి ఆరోపణ**

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతున్న పాకిస్థాన్‌ను ప్రపంచ పటం నుంచే తొలగించాలని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ సైనికులకు సంఘీభావం తెలిపే కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠంలో భారత సైన్యానికి మద్దతుగా ఆపరేషన్ సిందూర్ పేరిట సంఘీభావ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్ రావు, మల్లారెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, "పాకిస్థాన్‌తో మనం ఇప్పటికీ బాధలు పడుతూనే ఉన్నాం. వాళ్లు ఉగ్రవాదులను పోషిస్తున్నారు" అని మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి, "మోదీజీ, పాకిస్థాన్‌ను లేపేయండి. పాకిస్థాన్‌ను ముక్కలు ముక్కలు చేసి ప్రపంచ మ్యాప్‌లో లేకుండా చేయండి. మనకు స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు అయింది. కానీ అదే పాక్‌తో ఎప్పటికీ ఇబ్బందులు పడుతున్నాం" అన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని ప్రజలకు మల్లారెడ్డి పిలుపునిచ్చారు. "మనం సరిహద్దుల్లో పోరాటం చేయలేకపోవచ్చు, కానీ మన సైనికుల కోసం కనీసం రక్తదానం చేయడానికైనా సిద్ధంగా ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్ రావు, మల్లారెడ్డి, వివేకానంద త్రివర్ణ పతాకాలను చేతబట్టి సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు.






## ప్రాంగణ నియామకాల్లో 16 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక

**ఖమ్మం,మే 10(ప్రజాక్షేత్రం):**ప్రముఖ ఐ.టి. రంగ సంస్థ జెన్ట్రీ ల్యాబ్స్ మరియు స్మార్ట్ బ్రైన్స్ కు తమ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు.గత వారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు గాను శనివారం ఆఫర్ లెటర్స్ అందుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కృత్రిమ మేధస్సు ప్రపంచ గతిని శాసించే స్థాయిలో ఉందని,ఐ.టి.రంగ నిపుణులకు మంచి ఆదరణ ఉందని అభిప్రాయ పడ్డారు. ఎంపికైన విద్యార్థులు నిరంతరం నైపుణ్యాభివృద్ధి చెందాలని సూచించారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతున్న జెన్ ల్యాబ్స్ లో తమ విద్యార్థులు ఎంపిక అవ్వడం మరియు హెచ్. సి. ఎల్., కోఫోర్జ్ వంటి క్లైంట్స్ కలిగిన స్మార్ట్ బ్రైన్స్ లో ఉద్యోగాలు సాధించడం తమకు గర్వ కారణ మని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. ఇంటర్న్ ఇంజనీర్, డిసి ఆపరేషన్స్ మరియు సర్వీస్ డెస్క్ ఇంజనీర్ ఉద్యోగాలకు గాను నిర్వహించిన వివిధ దశల ఎంపికలలో జెన్ ల్యాబ్కు గాను 4గురు, స్మార్ట్ బ్రైన్స్ కు 12 మంది ఎంపికైనట్లు తెలియజేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శిక్షణ అనంతరం 22 నుండి 3.6 లక్షలు వార్షిక ఆధాయంగా లభిస్తుందని తెలిపారు. క్వాల్కామ్ వంటి అంతర్జాతీయ సంస్థలకు క్లైంట్గా ఉన్న జెన్రా ల్యాబ్స్ కు తమ కళాశాల విద్యార్థులను ఎంపిక చేయడం అటానమస్ గా తమకు తగిన గుర్తింపును తెచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపికలు నిర్వహించిన జెన్ ల్యాబ్స్ హెచ్. ఆర్. పి. నరేంద్ర తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, డా॥ జె. రవీంద్రబాబు,డా॥ యన్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యన్. సవిత,కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**వలిగొండ,మే 10(ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని వర్కట్పల్లి గ్రామంలో శనివారం రోజున ముఖ్యమంత్రి సహాయ నిధి పరమేష్ 26,000 రూపాయలు, మరియు ఎస్ స్వామి 40,000 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వర్కట్పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు ,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గురునానక్ యూనివర్సిటీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం మే 10(ప్రజాక్షేత్రం):** గురునానక్ యూనివర్సిటీ కాలేజీకి చెందిన విద్యార్థినిహాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా, తల్లాడ మండలం, కురనవెల్లి గ్రామానికి చెందిన అల్లూరి శశిరెడ్డి, ఆయన భార్య ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. వీరిలో భావన(22) రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతోంది. మరో అమ్మాయి జూబ్లీహిల్స్‌లో బీఎస్సీ నర్సింగ్ చదువుతుంది. అయితే ఉన్నట్టుండి భావన శనివారం ఉదయం 10 గంటలకు హాస్టల్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతిపై ఇప్పటి వరకు ఎలాంటి కారణాలు తెలియరాలేదు. భావన మృతిపై హాస్టల్ వార్డన్ పోలీసులకు, ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.




## డ్రోన్లపై నిషేధం

- **కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు**

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్లు ఎగురవేయడాన్ని నిషేధిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. భారత్, పాక్ మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిషేధాజ్ఞలు విధించారు. డ్రోన్లతోపాటు పారా గ్లైడర్లు, మైక్రో లైట్ ఎయిర్ క్రాఫ్టులను కూడా ఎగురవేయవద్దని సూచించారు. ఈ నిషేధాజ్ఞలు వచ్చే నెల 9వ తేదీ వరకు అమల్లో ఉంటాయన్నారు. ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## వనపర్తి జిల్లా రైతాంగం ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దు

**యం రాజేంద్ర ప్రసాద్ యాదవ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**



**వనపర్తి మే 10(ప్రజాక్షేత్రం):**కొంతమంది బీఆర్ఎస్ నాయకుల స్వలాభం కోసం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలి అని చూస్తున్నారు అని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యం. రాజేంద్ర ప్రసాద్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు... అలాంటి వారిని ఎక్కడ కూడ పట్టించుకోవద్దు అని విజ్ఞప్తి చేశారు. శనివారం శ్రీరంగాపురం మండల కేంద్ర పరిధిలోని వెంకటాపూర్ ఎక్స్ రోడ్ దగ్గర కొంతమంది రైతులను మాయమాటలు చెప్పి బి ఆర్ ఎస్ నాయకులు ధర్నా చేశారు. మన ప్రభుత్వం రైతు పక్షపాతి, ప్రభుత్వతో గత బిఆర్ఎస్ పాలను పోల్చుకునే రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు కు రైతంగం ఆశీర్వదాం ఎంతో ఉంది అని, ఇలాంటి సందర్బంలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కొద్దీ పాటి నష్టం కూడ రైతులకు జరగకుండా బాధత్తగా నిర్వహిస్తాము అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలిపారు. గత సం,,ఖరీఫ్ సీజన్ కన్న ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లా వ్యాప్తంగా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యము మాత్రమే పండింది, కానీ ప్రసుత ఖరీఫ్ సీజన్ లో 3లక్ష 90 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా పండుతుంది. అని అధికారులు అంచనా వేయడంలో గత కొన్ని సంవత్సరాలుగా మనం చూస్తున్నాం. రబ్బీలో 36.102 ఎకరాలలో 24.5762 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయడం జరిగింది. ఇంత పెద్ద పంటలు పండడానికి కారణం బీమా, జూరాల, సరళ సాగర్, కోయిన్ సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల నీటి వనరుల ద్వారా ఇంత పంట ఉత్పత్తి ఏంది దానిలో భాగంగానే అక్కడ అక్కడ సేకరణ ఆలస్యం అయినా రైతులు భయపడవద్దు అని కచ్చితంగా తడిసిన ధాన్యం అయినా, విపత్కర పరిస్థితిలో ఎలాంటి ఇబ్బంది జరిగిన రేవంత్ రెడ్డి నాయకత్వం లోని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆధ్వర్యంలో ఎప్పటికి అప్పుడు ఎమ్మెల్యే, లా దృష్టికి ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గారి దృష్టికి, ఎంపీ దృష్టికి, కలెక్టర్, లా దృష్టికి తీసుక వెళ్ళి సమస్యను పరిస్కారనికి కృషి చేస్తాము, అని గత 11 సంవత్సరాలలో రైతులకు న్యాయం చేయలేని గత ప్రభుత్వం సంవత్సర నర కాలం నుంచి రైతంగానికి అవసరం అయినా వంటి పథకాలను ఈ కింది విధంగా అమలు పరుస్తున్న సందర్బంలో ఎక్కడ రైతులను ఉనికి కొలిపోతామో అని కొత్త ఎత్తుగడ మొదలు పెట్టినారు. వీళ్ళను ఎప్పటికి నమ్మవద్దు అని వనపర్తి జిల్లా కాంగ్రెస్ పక్షాన మీ కష్టాలో ఎప్పటికి తోడు ఉంటాము అని తెలియజేస్తున్న అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెంబడే ఒక్క వనపర్తి జిల్లాలోని 2986 మంది రైతులకు వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరంకు 10వేల చొప్పున చెల్లించడం జరిగింది ఇది వాస్తవం కాదా, ఈ ఖరీఫ్ సీజన్లోనే వనపర్తి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని కూడా అధికారులు కొనుగోలు చేయించడం జరిగింది. కేవలం ఉద్దేశపూర్వకంగానే కొందరు రైతుల దృష్టిని మరణించాలనేటువంటి ఆలోచనతో బిఆర్ఎస్ నాయకుల తపన రైతులు అర్థం చేసుకోవాలి. కచ్చితంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో సివిల్ సప్లైశాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ప్రతినిత్యం ఎక్కడ కూడా రైతులకు ఇబ్బంది కలిగిన నా దృష్టికి తీసుకురావాలని ఆదేశిస్తా ఉన్నారు. గత ప్రభుత్వంలో బిఆర్ఎస్ నాయకులకు మిల్లులు అధికంగా ఉండేవని కోట్ల రూ, ధాన్యాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా ఉన్నందున్న చెల్లిచకుండా శనివారం ఎక్కడికక్కడ మిల్లులపైన ప్రభుత్వం రికవరీ చేసేటటువంటి దశలో ఈ విధమైన కృత్రిమ ధర్నాలు సృష్టిస్తున్నారని, మీ అందరి ఆశీర్వాదంతో ఏర్పడ్డ ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని మనవి చేస్తున్నాం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్న ధాన్యానికి బోనస్ 500 కింటాలు చొప్పున 67 కోట్ల రూపాయలు వనపర్తి జిల్లాలో చెల్లించడంతో పాటు గతంలో రైతులకు ధాన్యం బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న తర్వాత రెండు నెలలైనా రైతుల అకౌంట్లో డబ్బులు జమ అయ్యేవి కావు అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ధాన్యాన్ని వేసిన 3 నుండి 10 రోజుల లోపల దాన్యం పైసలు చెల్లింపులు జరిగింది, వాస్తవమ కాదా బిఆర్ఎస్ నాయకులు తెలుపాలి. వడ్ల బోనస్ తీసుకున్న వాళ్ళు కానీ ధాన్యం పైసలు తొందర పడ్డప్పుడు తీసుకున్న రైతులు బిఆర్ఎస్ లో లేరా ఈ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీలకతీతంగా సేవ చేయాలనేది సంకల్పం ఉన్నది. కానీ గతంలో బిఆర్ఎస్ నాయకులు వారి కార్యకర్త నాయకుడు అయితేనే అన్ని రకాలుగా లబ్ధి జరుగుతుండేది వాస్తవ కాదా, ఒకసారి మనన చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉన్నాము. ఇట్టి కార్యక్రమం లో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.రాజేంద్ర ప్రసాద్ యాదవ్, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రాముడు యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవింద్, మండల ఉపాధ్యక్షులు విష్ణు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రి, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామ రాజు, పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మదిలేటి, పట్టణ ఎస్ సి అధ్యక్షులు శ్రీను, వనపర్తి జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ కన్వీనర్ ఎస్. పురుషోత్తం యాదవ్, నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొనడం జరిగింది.

## నకిలీ బంగారం విక్రేతల పట్టివేత

**తూప్రాన్, మే 10(ప్రజాక్షేత్రం):** నకిలీ బంగారాన్ని విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు దుండగులను వ్యాపారులు చాకచక్యంగా పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన తూప్రాన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మధ్య ప్రదేశ్ రాష్ట్రం భోపాల్ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కిలోకి పైగా బరువున్న నకిలీ బంగారు ఆభరణాల బ్యాగును తీసుకొని పట్టణంలోని వినాయక నగర్ గల్లీలో ఉన్న నగల వ్యాపారుల దుకాణాలకు వచ్చారు. తమ గ్రామంలో ఇంటి వద్ద తవ్వుతుండగా బంగారు ఆభరణాలు లభించాయని, వాటిని విక్రయిస్తామని తెలిపారు. బంగారం వ్యాపారి వీరాచారి వారితో మాటలు కలిపాడు. ఆభరణం నుంచి కొద్ది ముక్కను కట్ చేసి ఆ ఇద్దరు వ్యక్తులు వీరాచారికి ఇచ్చారు. అది తనిఖీ చేయగా బంగారమని తేలింది. కిలోకి పైగా ఆభరణాలు ఉండడంతో అనుమానం వచ్చిన వ్యాపారులు.. సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. వారిని పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కొద్దిమేర బంగారాన్ని చూపి మిగతా నకిలీ బంగారం విక్రయించేందుకు వచ్చినట్లు విచారణలో తెలిసింది. కొన్ని నెలల కిందట తూప్రాన్ మండలంలోని ఇమాంపూర్‌లోనూ ఇదే తరహాలో దంపతులు.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని మోసం చేసి నకిలీ బంగారాన్ని అంటగట్టి రూ.ఐదు లక్షలతో ఉడాయించారు.



## మాతృ హృదయం

**నను మాయ జేసి, నా ఒడిలో చేరి,**
**విశ్వాన్నే చూపిన**
**కృష్ణయ్య.. నా చిన్ని కృష్ణయ్య**

**వెళ్ళొస్తానని చెప్పి, వెనుదిరగక,**
**మాతృ లోకానికే ప్రశ్నగా మారావా?**
**కృష్ణయ్య.... నా చిన్ని కృష్ణయ్య**

**ఇదెక్కడన్యాయమని అడిగితే,**
**గీతా సారాన్నే చెపుతావు,**
**నీ తప్పును కప్పుతావు,**
**నేటి తనయులకు మప్పుతావా?**
**కృష్ణయ్య.... నా చిన్ని కృష్ణయ్య**

**శివ్వాం కిరణ్ కుమార్**
**ప్రధానోపాధ్యాయులు**
**డి. ఎ. వి. హైస్కూల్.**
**సీలేరు.**




## రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం

- **పనిగట్టుకుని బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు**
- **ఏఐ టెక్నాలజీతో విష ప్రచారం**
- **ప్రజలు ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన**
- **ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం**
- **పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు పన్నుతున్నాయని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఏఐ టెక్నాలజీతో విష ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆర్థిక నిర్బంధమున్నా కూడా ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తామన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని తెలిపారు. మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నదని చెప్పారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పాలన సాగించి మూడేళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు 15 నెలల కాంగ్రెస్ పాలనకు బేరీజు వేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. పంచాయతీ కార్యదర్శుల సమస్య తీవ్రతను తాను అర్థం చేసుకుంటానని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ తుగ్లక్ పాలన చేయడంతోనే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు.





# ఫాస్ట్‌ట్యాగ్ చెల్లింపులకు బైబై

- టోల్ పేమెంట్‌కి కొత్త విధానం
- ఫాస్టాగ్ లేకున్నా ఇక నుంచి టోల్ చెల్లింపులు
- కొత్త విధానంతో చెల్లింపులకు శ్రీకారం చుట్టిన కేంద్రం
- ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రయాణం

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మరింత సులభంగా టోల్ వసూలయ్యేలా శాటిలైట్ విధానం అందుబాటులోకి వచ్చింది. ఒకప్పుడు టోల్ రుసుము కేవలం నగదుతోనే జరిగేది. ఆ తర్వాత 2019 డిసెంబర్ 15న కేంద్రం ఫాస్టాగ్ విధానాన్ని అమలులోకి వచ్చింది. ఈ మేరకు హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై, తెలంగాణలో పంతంగి(చౌటుప్పల్), కొర్లపహాడ్(కేతేపల్లి), ఏపీలో చిల్లకల్లు(నందిగామ) టోల్ ప్లాజాల వద్ద ప్రస్తుతం శాటిలైట్ ద్వారా టోల్ వసూలు చేస్తున్నారు. వాహనం ఆగనవసరం లేకుండానే శాటిలైట్ విధానం ద్వారా టోల్ దానికదే వసూలవుతోంది. దీంతో తమ వాహనాలకు ఫాస్టాగ్ లేకున్నా టోల్ చెల్లింపు ఎలా జరుగుతున్నాయని వాహనదారులు ఆశ్చర్యపోతున్నారు.

**హైదరాబాద్-విజయవాడ నేషనల్ హైవేపై ట్రయల్ రన్**

నేషనల్ హైవేలపై వాహనదారులు ప్రయాణించిన దూరం మేరకే టోలు వసూలు చేసేందుకు జీపీఎస్ ఆధారిత వ్యవస్థను తీసుకొస్తామని గతంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ విధానం అమలుకు కేంద్ర ప్రభుత్వం దేశ రాజధానిలో ట్రయల్ రన్ చేపట్టే యోచనలో ఉంది. త్వరలో హైదరాబాద్‌విజయవాడ నేషనల్ హైవేపై కూడా ఈ ట్రయల్ రన్ చేపట్టనున్నారని ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన ఓ అధికారి ఈటీవీ భారత్‌కు వివరించారు.

# కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ తూట్లు

- భారత్ సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్ దాడులు
- జమ్మూకశ్మీర్ సహా సరిహద్దు రాష్ట్రాలపై మళ్లీ డ్రోన్ దాడులు

**నేషనల్ బ్యూరో మే 10(ప్రజాక్షేత్రం):** పాకిస్థాన్ మరోసారి నమ్మక ద్రోహానికి పాల్పడింది. కాల్పుల విరమణకు అంగీకరించిన కొన్ని గంటల్లోనే జమ్మూ కశ్మీర్‌తోపాటు ఇతర సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్ దాడులకు తెగబడింది. పాక్ దాడుల వల్ల శ్రీనగర్‌లో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఏమైందని ఆయన ఎక్స్ వేదిక ప్రశ్నించారు.

**నియంత్రణ రేఖ వెంబడి పాక్ కాల్పులు**

పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, అంతర్జాతీయ సరిహద్దుతోపాటు నియంత్రణ రేఖ వెంబడి శనివారం రాత్రి అనేక ప్రాంతాల్లో దాడులు చేస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపుర్, శ్రీనగర్‌లలో భారీగా కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయి.

అయితే పాక్ డ్రోన్లను భారత గగనతల రక్షణ వ్యవస్థలు ఎప్పటికప్పుడు ధ్వంసం చేస్తున్నట్లు తెలుస్తోంది. పోఖ్రాన్, శ్రీనగర్‌లోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్ సమీపంలో పలు పాక్ డ్రోన్లను భారత వాయుసేన కూల్చివేసినట్లు సమాచారం. పంజాబ్‌లో టోటల్ బ్లాక్‌అవుట్ పాక్ దాడులు చేస్తున్న నేపథ్యంలో పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పుర్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, బాడ్‌మేర్‌లలో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కథువాలోనూ బ్లాక్‌అవుట్ పాటిస్తున్నారు. పంజాబ్‌లోని మోగాలోనూ కరెంట్ ఆపేశారు.

**గుజరాత్‌లోనూ డ్రోన్ దాడులు?**

గుజరాత్‌పై కూడా పాక్ డ్రోన్ దాడులు చేస్తున్నట్లు సమాచారం. కచ్ జిల్లాలో అనేక చోట్ల పాక్ డ్రోన్లు కనిపించాయని గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి పేర్కొన్నారు. అందుకే ఆయా ప్రాంతాల్లో పూర్తి బ్లాక్‌అవుట్ అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు సురక్షితంగా ఉండాలని, భయాందోళనలకు గురికావద్దని 'ఎక్స్' వేదికగా గుజరాత్ సీఎం సూచించారు.

**అత్యంత దుర్మార్గం:విక్రమ్ మిస్రీ**

పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. శనివారం రాత్రి దిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కాల్పుల విరమణ అవగాహనను పాక్ ఉల్లంఘించడం సరికాదన్నారు. డీజీఎంవో మధ్య జరిగిన అవగాహనను పాకిస్థాన్ ఉల్లంఘించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. గత కొన్ని గంటలుగా పాక్ సరిహద్దుల వెంబడి కాల్పులకు, డ్రోన్ దాడులకు పాల్పడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమని ఘాటుగా స్పందించారు. కాల్పుల వివరణ ఒప్పందం ఉల్లంఘనకు సంపూర్ణ బాధ్యత పాకిస్థాన్‌దేనని మిస్రీ స్పష్టం చేశారు. సరిహద్దుల్లో పాక్ దాడులకు భారత సైన్యం తగిన విధంగా జవాబిస్తుందన్నారు. పాక్ అతిక్రమణలను, చొరబాటులను నిలువరించేందుకు భారత సైన్యానికి సంపూర్ణ అధికారాలు ఇచ్చామని తెలిపారు. ఇప్పటికైనా పాకిస్థాన్ దాడులు నిలువరిస్తుందని ఆశిస్తున్నట్టు విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు.



# మధ్యవర్తిత్వం ఎందుకు?

- కేంద్రాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత
- కాల్పుల విరమణను స్వాగతించిన ఎమ్మెల్సీ
- దేశాన్ని రక్షించడానికి భారత్ ధైర్యంగా పోరాడింది
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి
- అన్ని అంశాలను ప్రజలకు వివరించాలి

**తెలంగాణ బ్యూరో, మే 10(ప్రజాక్షేత్రం):**

భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న అంశాల విషయంలో ద్వైపాక్షికంగానే ఎప్పుడూ పరిష్కరించుకునే ప్రయత్నం జరిగేది. అయితే, ఎప్పుడూ లేనివిధంగా అకస్మాత్తుగా అమెరికా ఎందుకు ప్రవేశించి మధ్యవర్తిత్వం వహించాల్సి వచ్చిందో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో పాకిస్థాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దేశాన్ని, ప్రజలను రక్షించడానికి భారత సైన్యం ధైర్యంగా పోరాటం చేసిందని కొనియాడారు. భవిష్యత్తులో పాకిస్థాన్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండేందుకు మనం ఎంత గట్టిగా నిలవరించగలిగామనే అంశాలపై ప్రధానమంత్రి, రక్షణ శాఖ మంత్రి దేశ ప్రజలకు వివరిస్తే బాగుంటుందని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అన్ని అంశాలపై చర్చించాలని అన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య సమస్యలు, అంశాలపై రెండు దేశాలు మాత్రమే కూర్చొని మాట్లాడాలని, ఇతర దేశాల జోక్యం చేసుకోవడం లేదా మధ్యవర్తిత్వం వహించడం సరికాదన్న అభిప్రాయం దేశ ప్రజల్లో ఉందని తెలిపారు. కానీ, అకస్మాత్తుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, అమె మధ్యవర్తిత్వం వహించిందని ట్వీట్ చేయడం కొంత బాధ అనిపించిందని అన్నారు. మన ప్రధానమంత్రి ట్వీట్ చేసి ఉంటే మన దేశ గొప్పతనం మరింత పెరిగేదని చెప్పారు.



# నేటి నుంచి హైదరాబాద్ లో కఠిన ఆంక్షలు:సీపీ సీవీ ఆనంద్!

**హైదరాబాద్ మే 10(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ నగరంలో బాణాసంచా కాల్చడంపై పోలీసులు నిషేధం విధించారు. పెళ్లిళ్లు, పండుగలు, షాపుల ప్రారంభోత్సవాలు వంటి ఏ సందర్భంలోనైనా సరే బాణాసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. బాణాసంచా అమ్మేవారికి కూడా హెచ్చరికలు జారీ చేశారు. బాణాసంచా కాల్చితే జైలుకు పంపుతామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నిషేధానికి ప్రధాన కారణం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనడం, నగరంలో భద్రతా చర్యలు కొనసాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాణాసంచా శబ్దాలు పేలుళ్లుగా అన్వయించుకునే ప్రమాదం ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొనే అవకాశం ఉంది. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించవచ్చు. అంతేకాకుండా, బాణాసంచా శబ్దాలు భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి. దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో, బాణాసంచా కాల్చడం వల్ల ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్పందించడం కష్టమవుతుందన్నారు. మరోవైపు నగరవ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. సిపి సీవీ ఆనంద్,భద్రతను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నారు. బందోబస్తు పై పోలీసులకు సూచనలు ఇస్తున్నారు. ప్రజలు ఎలాంటి బయభ్రాంతులకు గురి కావద్దని ప్రజలకు ఆయన భరోసా కనిపిస్తు న్నారు. అలాగే నగరంలో అనుమానాస్పద వ్యక్తులపై కూడా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నిషేధాజ్ఞలు తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతాయని తెలిపారు.



# మరో తెలుగు జవాన్ వీరమరణం..!

- పాక్ కాల్పుల్లో మరో జవాన్ వీరమరణం..
- ప్రాణాలు విడిచిన జవాన్ సచిన్ యాదవ్‌రావు వనాంజే..
- స్వస్థలం మహారాష్ట్ర - తెలంగాణ బార్డర్‌లోని నాందేడ్ జిల్లా తమ్లూర్...

**తెలంగాణ బ్యూరో, మే 10(ప్రజాక్షేత్రం):**

భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తలు కొనసాగుతూనే ఉన్నాయి.. పాక్ దాడులను భారత్ సమర్థవంతంగా తిప్పికొడుతున్నా.. కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం తప్పడంలేదు.. సాధారణ ప్రజలు కొందరు ప్రాణాలు కోల్పోగా.. శత్రుదేశంతో పోరాడుతూ కొందరు జవాన్లు వీరమరణం పొందుతున్నారు.. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందగా.. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడానికి ఏపీ సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది.. మరోవైపు.. ఈ రోజు పాక్ కాల్పుల్లో మరో జవాన్ వీరమరణం పొందారు.. జమ్మూలో పాక్ జరిపిన కాల్పుల్లో జవాన్ సచిన్ యాదవ్‌రావు వనాంజే ప్రాణాలు విడిచారు.. సచిన్ యాదవ్ రావు వనాంజే వయస్సు 29 ఏళ్లు.. ఆయన స్వస్థలం మహారాష్ట్ర – తెలంగాణ బార్డర్‌లోని నాందేడ్ జిల్లా తమ్లూర్... సచిన్ యాదవ్‌రావు వనాంజే మృతితో తమ్లూర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.. ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.. అయితే, ఇవాళ స్వస్థలానికి సచిన్ యాదవ్‌రావు వనాంజే పార్థివదేహాన్ని తరలించేందుకు ఇండియన్ ఆర్మీ ఏర్పాట్లు చేస్తోంది..





# ఉగ్రవాదం అంతమై శాంతి నెలకొనాలి

**తెలంగాణ బ్యూరో, మే 10(ప్రజాక్షేత్రం):**

ఉగ్రవాదం అంతమై భారతదేశంలో శాంతి నెలకొనాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ఆకాంక్షించారు. దుర్గా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో సిద్దిపేటలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో 108 హోమగుండాలతో శనివారం హనుమాన్ యజ్ఞం నిర్వహించారు. ఇందులో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దుర్గాప్రసాద్ స్వామి ఆశీస్సులతో చేసే ఈ హోమం ఫలించాలని కోరుకున్నారు.

ఆయన చేతుల మీదుగా హోమం సిద్దిపేటలో జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో ఈ భక్తి కార్యక్రమాన్ని మొట్టమొదటగా సిద్దిపేటలో ప్రారంభించడం జరిగిందన్నారు. యువతను భక్తి మార్గంలో నడిపించి, క్రమశిక్షణతో సన్మార్గంలో నడిచేందుకు ఈ హనుమాన్ దీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు. దీక్ష సమయంలో యువకులు మండుతున్న ఎండలో చెప్పులు లేకుండా తిరుగుతూ భక్తి భావాన్ని చూపడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు మంచి మార్గంలో వెళ్లడానికి హనుమాన్ భక్తులు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. భగవంతుడిని, తల్లిదండ్రులను పూజిస్తూ, కష్టాన్ని నమ్ముకుని యువకులు నిజాయితీతో జీవితంలో పైకి రావాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం సుఖ సంతోషాలతో ఎల్లప్పుడూ ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నట్లు చెప్పారు. పహల్గామ్‌లో అమాయకులైన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను ఏరి వేయడానికి భారత సైన్యం అద్భుతంగా పోరాటం చేస్తోందన్నారు. భారత సైనికులకు బలాన్ని అందించి, ఉగ్రవాదులపై విజయం సాధించాలని కోరుకున్నారు. అనంతరం సిద్దిపేట పట్టణం రంగాధాంపల్లిలోని హనుమాన్ దేవాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని ప్రారంభించి, హనుమాన్ స్వాములతో కలసి హరీశ్ రావు భోజనం చేశారు.

# పుట్టగొడుగుల్లా ప్రైవేటు ఆస్పత్రులు.. ఆర్‌ఎంపీ డాక్టర్లు, నర్సులతో చికిత్సలు

**ఇబ్రహీంపట్నం, మే 10(ప్రజాక్షేత్రం):**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రం ప్రైవేటు దవాఖానాలకు కేరాఫ్‌గా మారింది. గల్లీకో దవాఖానాను ఏర్పాటుచేసి అర్హతలేని వైద్యులు, వైద్య చికిత్సలపై ఏమాత్రం అనుభవంలేని నర్సులను నియమించి పేద ప్రజల దగ్గర దవాఖానాల పేరిట పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లుకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులు వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. ప్రముఖ వైద్యులపేరిట ఆస్పత్రులకు అనుమతులు తీసుకుని స్టాఫ్ నర్సులు, ఆర్‌ఎంపీలతో వైద్యశాలలు కొనసాగిస్తున్నారు.

అనుభవం, అర్హత ఉన్న డాక్టర్ల పేరుతో ఆస్పత్రులను నెలకొల్పి.. వైద్యులు నగరంలో ఎక్కడో ఉంటూ, స్థానికంగా ఉన్న నర్సులతో వాట్సప్ కాల్స్ ద్వారా వైద్య చికిత్సలు కొనసాగిస్తున్నారు. డబ్బుల సంపాదనే పరమావదిగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతూ.. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ అమాయకపు ప్రజలను నిండా ముంచుతున్నారు. దీనిపై స్పందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది.

పట్టణంలో సుమారు 20 వరకు ప్రైవేటు దవాఖాలను నెలకొల్పి వాటిలో స్టాప్ నర్సుల ద్వారా చికిత్సలు నిర్వహించి అమాయకులను బలి తీసుకుంటున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని మంచాల రోడ్డులోగల విజయలక్ష్మి ఆస్పత్రిలో ఓ మహిళకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించగా, అది వికటించింది. ఆ సంఘటన మరువకముందే నగరంలో ఉన్న వైద్యురాలు.. స్టాప్ నర్సుల చేత వాట్సప్‌కాల్‌లో వైద్య చికిత్సలు చేయించటం ద్వారా ఓ తల్లి కడుపులోనే ఇద్దరు కవలల పిల్లలు మృతిచెందారు.

**ప్రైవేటు దవాఖానల్లో కొనసాగుతున్న బ్రూణహత్యలు...**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గతంలో ఓ ప్రైవేటు దవాఖానలో డెలవరీ కోసం వచ్చిన ఓ గిరిజన మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అప్పటికే ఆ మహిళకు ఇద్దరు ఆడపిల్లలు ఉండటంతో తనకు మగ బిడ్డ కావాలనుకుంటే ఆడబిడ్డ పుట్టిందని, ఈ బిడ్డను నేను సాకలేనని చెప్పటంతో ఆ ఆస్పత్రి యాజమాన్యం ఆడబిడ్డను ఇతరులకు విక్రయించేందుకు సహాయం చేసింది. దీంతో వైద్యారోగ్యశాఖ అధికారులు ఆ దవాఖానను సీజ్ చేశారు. మల్లీ రెండు నెలల తర్వాత అదే వైద్యులు పేరుమార్చి దవాఖానాను కొనసాగిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇబ్రహీంపట్నంతోపాటు యాచారం మండలం మాల్‌లోని పలు ప్రైవేటు హాస్పిటళ్లలో కడుపులోనే ఆడబిడ్డలను చిదిమేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన తండాల్లోని ఆర్‌ఎంపీ డాక్టర్ల ద్వారా ఈ ఆస్పత్రులకు రెఫర్ చేయించుకుని ఆడబిడ్డలు ఉంటే కడుపులోనే చిదిమేస్తున్నారని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవల్సిన వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవటం లేదని గ్రామీణప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ప్రైవేటు ఆస్పత్రికి పోతే భయం.. భయం..**


ఓవైపు ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య చికిత్సలు నిర్వహించటంలేదు, వైద్యులు కూడా సకాలంలో అందుబాటులోకి రాకపోవటంతో చేసేదేమీలేక ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను సంప్రదిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యులు లక్షల ఫీజులు వసూళ్లు చేస్తూ పేదప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అర్హతలేని వైద్యులతో వైద్య చికిత్సలు నిర్వహిస్తూ... ఆస్పత్రుల్లోనే మెడికల్ షాప్‌లను ఏర్పాటు చేసుకుని, అవసరం లేని మందులు రాసి వేలల్లో డబ్బులు వసూళ్లుచేసి మల్లీ తిరిగి అవే మందులు మెడికల్‌షాప్‌కి తీసుకెల్లి విక్రయిస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలొస్తున్నాయి. ఇలాంటి వాటిపై ఓ కన్నేసి చర్యలు తీసుకోవల్సిన ప్రభుత్వ అధికారులు కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోవటంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**అందుబాటులో ఉండని వైద్యులు..**

ప్రైవేటు ఆస్పత్రులను స్థాపించిన వైద్యులు, యాజమాన్యాలు అందుబాటులో ఉండరు. ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటుచేసి వారు నగరంలోని పెద్దపెద్ద దవాఖానాల్లో చికిత్సలు నిర్వహిస్తుంటారు. ఇక్కడ ఎమర్జెన్సీగా ఎవరైనా వైద్యంకోసం వస్తే నగరం నుంచే ఆన్‌లైన్‌లో ఇక్కడ ఉన్న అనుభవం లేని నర్సులతో చికిత్సలు చేయిస్తున్నారు. దీంతో ఎంతోమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అలాగే, గంటల తరబడి వైద్యుల కోసం నిరీక్షించి.. నిరీక్షించి ప్రాణాలు పోగొట్టుకోవల్సిన పరిస్థితులు కూడా దాపురిస్తున్నాయి. ఒకరిపేరున ఆస్పత్రి ఏర్పాటుచేస్తారు. ఆయన ఎవరో కూడా ఇక్కడ ఉండరు. అర్హత ఉన్న ఓ వైద్యుని పేరున ఆస్పత్రి ప్రారంభించి ఆయనకు ఎంతో కొంత ముట్టచెప్పి.. ఇక్కడ ఆస్పత్రిని మాత్రం అర్హతలేని నర్సులతో, ఆర్‌ఎంపీ డాక్టర్లతో నిర్వహిస్తున్నారు. ఇలాంటి వారిపై పూర్తి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అర్హతలేని ఆస్పత్రులను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.







# 'జెన్‌జెడ్' ప్రేమలు సరికొత్త ట్రెండ్

**ప్రేమ గురించి శంకర్‌దాదా ఎంబీబీఎస్ లో చిరంజీవి ఒక ఫేమస్ డైలాగ్ చెప్పారు. అదేనండీ.. 'నిజమే.. ప్రేమ గురించి నాకేం తెలుసు. లైలా-మజునుకు తెలుసు, పారు-దేవదాసుకు తెలుసు.. ఆ తర్వాత తమకే తెలుసు.' ప్రేమకు ప్రతిరూపంగా చిరంజీవి చెప్పిన లైలా-మజును, పారు-దేవదాసులకు కూడా తెలీయని ఎన్నో వెరైటీ లవ్ రిలేషన్‌షిప్స్ గురించి నేటి యువతరంకు చాలా బాగా తెలుసంటా. ఎద్దైనా హోటల్లోకి వెళ్తే వారు ఇచ్చే మెనూ కార్డ్‌లో కంటే 'జెన్‌జెడ్'రిలేషన్‌షిప్స్‌లోనే ఎక్కువ వెరైటీలు ఉన్నాయంటా. అసలు ఈ 'జెన్‌జెడ్' రిలేషన్‌షిప్స్ ఏంటని అనుకుంటున్నారా..? అయితే పూర్తిగా ఇదేంటో తెలుసుకుందాం.**

మొబైల్, సోషల్ మీడియా, డేటింగ్ యాప్స్ వచ్చాక రిలేషన్స్ కొత్త మలుపు తిరిగాయి. రిలేషన్ అంటే పెళ్లి వరకు వెళ్లాల్సిన అవసరం లేదనేది పెరిగిపోయింది. టెంపరరీ అట్రాక్షన్‌కి వింత వింత పేర్లు పెట్టి దాన్ని ప్రేమకు మరో రూపం అనేస్తున్నారు. ఈ తరహాలో వచ్చిందే 'జెన్‌జెడ్' రిలేషన్‌షిప్స్. ఈ టైప్ రిలేషన్‌లో పార్ట్‌నర్‌ను బయటి ప్రపంచానికి పరిచయం చేయరు. ఒకవేళ ఆ రిలేషన్ నిలవకపోతే విడిపోయే అవకాశం ఉంటుందనే ఈ తరహా రిలేషన్‌ను ఎంచుకుంటారు. ఇలానే దీనిలో ఇంకా చాలా వెరైటీస్ ఉన్నాయి.

**బెంచింగ్**

రిలేషన్‌షిప్‌లో 'బెంచింగ్' అంటే జీవితంలో ఒకరితో రిలేషన్ ఉంటుంది, కానీ ఆ బంధంపై పూర్తిగా ఫోకస్ పెట్టరు. అలాని విడిచిపెట్టడమూ ఉండదు. అలాంటి వ్యక్తిని ఫ్యూచర్ కోసం 'బెంచ్' మీద ఉంచినట్టే. అవసరం అయినప్పుడు తిరిగి మాట్లాడతారు. ఈ విధంగా ఎదుటి వారి ఫీలింగ్‌స్‌ని అర్థం చేసుకోకుండా వాయిదా వేయడాన్ని బెంచింగ్ అంటారు.

**జాంబీయింగ్**

ఒకరిని పూర్తిగా వదిలేసి వెళ్లిపోయిన వ్యక్తి, కొంత కాలానికి తిరిగి కాంటాక్ట్‌కి రావడాన్నే 'జాంబీయింగ్' అంటారు. అలా వచ్చేసి మళ్లీ ఎటూ సరిగా ముందుకు పోకుండా ఉంటారు. గతాన్ని తవ్వుతూ తిరిగి ప్రేమను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు. కానీ నిజంగా వాళ్లకు రిలేషన్ కొనసాగించాలనే ఆలోచన ఉండదు.

**సిచ్యుయేషన్‌షిప్**

ఇద్దరికీ ఒకరి మీద ఒకరికి ఇష్టం ఉంటుంది. కలిసి ఎక్కువ సేపు గడుపుతారు కూడా. కానీ వారి మధ్య రిలేషన్ ఏంటి అంటే చెప్పలేని పరిస్థితి. ప్రపోజ్ చేయకపోవచ్చు. కానీ డేట్‌లు మాత్రం పెరుగుతుంటాయి. ఇది ఒకరకంగా రిలేషన్‌లో ఉండడమే, కానీ ఇద్దరూ దాన్ని అధికారికంగా ఒకరికి ఒకరు చెప్పుకోరు. బయటకు చెప్పరు. అలాంటి రిలేషన్‌కి ఏం పేరు పెట్టాలో తేలకుండా ఉంటే, అదే 'సిచ్యుయేషన్‌షిప్'.

**బ్రెడ్‌క్రంబింగ్**

అవతలి వ్యక్తి పట్ల ఇంట్రెస్ట్.. ఫీలింగ్స్ ఉన్నట్లు, ఆ రిలేషన్‌షిప్ కోసం ఎంతో సమయం వెచ్చిస్తున్నట్లు నటించడమే 'బ్రెడ్‌క్రంబింగ్'. అటెన్షన్ కోసం, అవతలి వాళ్ల మీద నియంత్రణ కోసం ఈ డ్రామా ఆడతారు.

**ఘోస్టింగ్**

ఒకప్పుడు రోజూ మాట్లాడే వ్యక్తి, ఒక్కసారిగా మాట్లాడడం తగ్గించి చివరకు పూర్తిగా మాయం అవుతారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం, మెసేజ్‌లకు స్పందించకపోవడం ఇలా మెల్లిగా రిలేషన్ కట్ చేయడమే 'ఘోస్టింగ్'. ఇది చాలా అనుచితమైన బ్రేకప్ అని అంటుంటారు.

**కఫింగ్**

చలికాలం, సెలవులు, వాలంటైన్ వీక్.. ఇలా ప్రత్యేక సమయం, సందర్భాల్లో డేటింగ్ చేయడాన్ని కఫింగ్ అంటున్నారు.

**డ్రై డేటింగ్**


ఆల్కహాల్ ఫ్రీ డేట్ అన్నమాట. అంటే డేటింగ్‌కి వెళ్లినప్పుడు ఆల్కహాల్ తీసుకోరు. సింగిల్స్, రిలేషన్‌షిప్‌లో ఉన్నవాళ్లు.. అందరూ ఈ డ్రై డేట్స్‌కి ప్రాధాన్యమిస్తున్నారు. సింగిల్స్ అయితే తమకు కాబోయే పార్ట్‌నర్ మందు ప్రభావానికి లోనుకాకుండా సహజంగా ఎలా ప్రవర్తిస్తాడు,ప్రవర్తిస్తుంది అని తెలుసుకోవడానికి, అదివరకే రిలేషన్‌షిప్ లో ఉన్నవాళ్లయితే తమ అనుభవాలు, మంచి చెడులను చర్చించుకోవడానికి ఈ డ్రై డేట్స్‌ని ప్రిఫర్ చేస్తున్నారు.


**సిట్యుయేషన్‌షిప్**

ఇది ఫ్రెండ్‌షిప్‌కి ఎక్కువ.. రిలేషన్‌షిప్‌కి తక్కువ! అటాచ్‌మెంట్ ఉంటుంది. కానీ కమిట్‌మెంట్ ఉండదు.

ఇవే కాదు ఈ 'జెన్‌జెడ్' రిలేషిప్స్‌లో చాలా రకాలు ఉన్నాయి. ఇప్పుడు ఉన్న ఆధునిక కాలంలో ప్రేమలు, పెళ్లిళ్ల పద్ధతులే మారిపోయాయి. ఒకప్పుడు పెద్దవారు చూసి మాత్రమే పెళ్లిళ్లు చేసేవారు. కానీ ఇప్పుడు ఎవరికి వారే ప్రేమ వివాహాలు చేసుకోవడానికి ఇష్టపడుతున్నారు. దీనికి తోడు ఇప్పుడు 'జెన్‌జెడ్' అనే మరొక కొత్త ట్రెండ్ ఉద్భవించింది.







# దేశాలు మారే దీవి

వృద్ధాప్యంలో ఉన్న తల్లీదండ్రులను వారి సంతానమైన కొడుకులు, కూతుర్లు చెరో ఆరునెలలు పోషిండం చూస్తుంటాం. కానీ ఓ ఐలాండ్‌ను కూడా రెండు దేశాలు చెరో ఆరు నెలలు పాలించే విషయం గురించి ఎప్పుడైనా విన్నారా..? ఆశ్చర్యకరంగా ఉంది కదా. ఇది నిజమండోయ్.. ఆ దీవి పేరు ఫెసెంట్ ఐలాండ్. దీన్ని ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలు పంచుకొని పాలిస్తున్నాయి. అంతే కాదు ఆ దీవిపై పెత్తనం కోసం ఆ రెండు దేశాలు దాదాపు మూడు దశాబ్ధాల పాటు యుద్ధం కూడా చేశాయంటా. ఇంతకీ ఆ దీవి పేరేంటి ? ఎక్కడుంది ? అనేది తెలుసుకుందాం.

స్పెయిన్, ఫ్రాన్స్ దేశాలకు మధ్యలో ఉన్న బిడసోవా నదిపై ఫిసంట్ ఐలాండ్ ఉంది. 200 మీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పు ఉండే ఈ దీవికి ఘన చరిత్ర ఉంది. దీని కోసం వందేండ్ల కిందట ఫ్రాన్స్‌కు, స్పెయిన్‌కు మధ్య ముప్పై ఏండ్ల పాటు యుద్ధం జరిగింది. యుద్ధం ముగిసిన తర్వాత ఆ రెండు దేశాల మధ్యలో ఉండే ఫిసంట్ ఐలాండ్ కోసం ఇరు దేశాలు రాయబారులను పంపాయి. ఐలాండ్ మాకంటే మాకు అని గొడవ పడ్డాయి. అలా పదకొండేండ్లు వాదించుకున్నా కూడా చర్చలు సఫలం కాలేదు. దీంతో ఆ ఐలాండ్ ఎటూ కాకుండా మిగిలిపోయింది.

ఆ తర్వాత 1659లో ఇరు దేశాల ఉమ్మడి నియంత్రణలో ఈ దీవి ఉండేలా ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇది ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల మధ్య శాంతికి ప్రతీకగా నిలుస్తోంది. ఒప్పందానికి గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాశాసనం ఇప్పటికీ అక్కడ చూడొచ్చు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 1 నుంచి జులై 31 వరకూ ఐలాండ్ స్పెయిన్ కంట్రోల్‌లో ఉంటే, మిగతా రోజులు ఫ్రాన్స్ కంట్రోల్‌లో ఉంటుంది. ఇక్కడికి పర్యాటకులకు అనుమతి ఉండదు. కానీ, ఏటా దీవిని అప్పగించే సమయంలో గ్రాండ్ ఈవెంట్ జరుగుతుంది. అది చూసేందుకు వచ్చే టూరిస్టులకు అనుమతిస్తారు.

ఇక ఐలాండ్‌లో పనిచేసే మున్సిపల్ వర్కర్లు కూడా ఆరు నెలలకోసారి మారుతుంటారు. స్పెయిన్ అధీనంలో ఉన్నప్పుడు ఇరున్ మున్సిపాలిటీ, ఫ్రాన్స్ అధీనంలో ఉన్నప్పుడు హెండయె మున్సిపాలిటీ ఈ దీవిని శుభ్రపరిచి గార్డెనింగ్ పనులు చేస్తాయి. నావిక దళం పర్యవేక్షకులు కూడా ప్రతి ఐదు రోజులకోసారి దీవిలోకి వచ్చి పరిశీలించి వెళ్తారు.



# భైరవం రిలీజ్ వచ్చేసింది.. ఎప్పుడంటే..?

టాలీవుడ్ లో ఎప్పటి నుంచో వినిపిస్తున్న మూవీ భైరవం. ఈ మూవీ రిలీజ్ డేట్ పై చాలా రకాల అనుమానాలు మొన్నటి వరకు వినిపించాయి. కానీ తాజాగా వాటికి చెక్ పెడుతూ రిలీజ్ డేట్ ను ప్రకటించింది మూవీ టీమ్. మంచు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కలిసి నటిస్తున్న ఈ సినిమాను విజయ్ కనకమేడల డైరెక్ట్ చేస్తున్నారు. అదితి శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది హీరోయిన్లుగా నటిస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమాను ఏప్రిల్ లోనే రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ అనుకోని కారణాలతో వాయిదా వేశారు. తాజాగా మే 30న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

ఈ మేరకు కొత్త పోస్టర్ ను విడుదల చేస్తూ ఈ రిలీజ్ డేట్ ను ప్రకటించారు. ఇక నుంచి వరుస అప్డేట్లు వస్తాయని.. మూవీ ప్రమోషన్లు కూడా జోరుగా సాగుతాయని తెలిపారు. ఈ ముగ్గురి నుంచి సినిమా వచ్చి చాలా కాలం అవుతోంది. సాయి శ్రీనివాస్ అప్పడప్పుడు కనిపిస్తున్నా.. హిట్ లేదు. ఇక రోహిత్, మనోజ్ అయితే ఐదారేళ్ల క్రితం కనిపించారు. ఇప్పుడు ఈ మూవీ భారీ ఎత్తున వస్తోంది. దీంతో ఎలాగైనా హిట్ కొట్టాలనే తపనతో ఉన్నారు ఈ ముగ్గురూ కూడా. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. త్వరలోనే ట్రైలర్ ను రిలీజ్ చేయబోతున్నారు. ఈ ముగ్గురూ ప్రమోషన్లు కూడా స్టార్ట్ చేయబోతున్నారు.





## రౌడీబాయ్‌కి పోటీగా మంచు మనోజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్.. ఈ ముగ్గురు హీరోలు కలిసి 'భైరవం' అనే మల్టీస్టారర్ సినిమాతో రాబోతున్నారు. భైరవం సినిమా శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కెకె రాధా మోహన్ నిర్మాణంలో విజయ్ కనకమేడల తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో దివ్య పిళ్ళై, అదితి శంకర్, ఆనంది హీరోయిన్స్ గా, జయసుధ కీలక పాత్రలో నటిస్తున్నారు. అయితే ఇప్పటికే భైరవం సినిమా టీజర్, సాంగ్ రిలీజ్ చేసారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ని ప్రకటించారు. ఈ సినిమాని మే 30న రిలీజ్ చేస్తున్నట్టు మూవీ యూనిట్ అధికారికంగా ప్రకటించారు. అయితే అదే రోజు విజయ్ దేవరకొండ పాన్ ఇండియా సినిమా కింగ్డమ్ కూడా రిలీజ్ కానుంది. మరి ఈ రెండు సినిమాలు ఏ రేంజ్ లో మెప్పిస్తాయో చూడాలి. ఈ సినిమాలో ముగ్గురు హీరోలు ఉండటం, తమిళ్ సూపర్ హిట్ సినిమా గరుడన్ రీమేక్ కావడంతో ఈ సినిమాపై కూడా అంచనాలు నెల కొన్నాయి.

## అక్కినేని హీరో ప్రేమలో మృణాల్..?

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మలో మృణాల్ ఠాకూర్ కొంత కాలంగా తెలుగు ప్రేక్షకుల ఆదరణను పొందుతోంది. 'సీతారామం' చిత్రం తర్వాత మృణాల్ ఠాకూర్ కు దక్షిణాదిన మంచి క్రేజ్ ఏర్పడింది. ఆమె నటనటకు తెలుగు ప్రేక్షకులు మాత్రం ఫుల్ ఫిదా అయ్యారు. అప్పటి నుంచి మృణాల్ ఠాకూర్ టాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సందడి చేస్తూనే ఉంది. ఇదే క్రమంలో ఈ ముద్దుగుమ్మ పేరు ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. అక్కినేని హీరోతో ఎఫైర్ సాగిస్తోందనే టాక్ వినిపిస్తున్నాయి. తాజాగా ఒక ఫొటో కూడా వైరల్ గా మారింది.ప్రస్తుతం టాలీవుడ్ లో అక్కినేని సుమంత్ తో మృణాల్ ఠాకూర్ ఎఫైర్ గురించే చర్చ నడుస్తోంది. తాజాగా వీరిద్దరూ ఇలా క్లోజ్ గా కలిసి ఉన్న ఫొటో కూడా నెట్టింట వైరల్ అయింది. దీంతో వీరిద్దరూ రిలేషన్ షిప్ లో ఉన్నారని సినీ ప్రముఖులు, ఈ ఫొటోను చూసిన నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఒకరితో ఒకరు బాగా క్లోజ్ గా కనిపిస్తుండటంతో వారిద్దరి మధ్య రిలేషన్ కన్ఫమ్ అంటున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో వెనక ఉన్న మతలాబ్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. కానీ ఇంకా అటు సుమంత్ కానీ, ఇటు మృణాల్ ఠాకూర్ గానీ అధికారికంగా ప్రకటించలేదు. ఇక ఈ రిలేషన్ షిప్ గాసిప్స్‌పై వారిద్దరూ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది.





## హాలీవుడ్ సినిమాలో కంగనా

నేషనల్ అవార్డు విన్నర్ కంగనా రనౌత్ టాలెంట్ గురించి కొత్తగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే ఎన్నో సినిమాలతో నటిగా తనను తాను ప్రూవ్ చేసుకున్న కంగనా నుంచి రీసెంట్ గా ఆడియన్స్ ను ఇంప్రెస్ చేసే సినిమాలేవీ రాలేదు. ఎమర్జెన్సీ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఆ సినిమా చేస్తే ఆ సినిమా కంగనా ఆశలపై నీళ్లు చల్లింది. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీగా ఈ సినిమాలో కంగనా కనిపించింది. ఈ సినిమాలో కంగనా నటనకు మంచి ప్రశంసలు వచ్చినప్పటికీ సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఆ సినిమా తర్వాత కంగన నుంచి మరో సినిమా వచ్చింది లేదు. అయితే ఇప్పుడు కంగన ఓ హాలీవుడ్ సినిమాలో నటిస్తుందని టాక్. బ్లెస్డ్ బి ది ఈవిల్ అనే హాలీవుడ్ సినిమాలో కంగన ఛాన్స్ అందుకున్నట్టు సమాచారం. హార్రర్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో కంగన టైలర్ పోజీ, స్కార్లెట్ రోజ్ స్టాలోన్ తో కలిసి స్క్రీన్ ను షేర్ చేసుకోనుంది. లయన్ మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఈ సమ్మర్ లోనే న్యూయార్క్ లో మొదలవనుంది.

## నా పిల్లలను అలా మాత్రం పెంచను

ఒకప్పుడు తెలుగు తెరపై అగ్ర కథానాయికగా వెలుగొందిన గోవా సుందరి ఇలియానా ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో సంతోషంగా గడుపుతుంది. త్వరలోనే రెండో బిడ్డకు ఆమె జన్మను ఇవ్వబోతున్నారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఆమె ముచ్చటించారు. పిల్లల పెంపకం,నిజమైన ప్రేమ గురించి తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఒక అభిమాని, "పిల్లలు మంచిగా పెరగాలంటే తల్లిగా ఏం చేయాలి? నిజమైన ప్రేమ అంటే ఏమిటి?" అని ప్రశ్నించారు. దీనికి ఇలియానా సమాధానమిచ్చారు." ప్రేమను 'సంపాదించుకోవాలి' అనే భావనతో మాత్రం నా పిల్లల్ని పెంచను. ఎందుకంటే అది నేను అనుభవించిన చెత్త అనుభూతి." నా పిల్లలను దయగల వ్యక్తులుగా, ఎల్లప్పుడూ సంతోషంగా, ఆరోగ్యంగా జీవించేలా పెంచాలనుకుంటున్నాను. ప్రతి తల్లిదండ్రులూ కోరుకునేది ఇదే. పిల్లలు తమ తల్లిదండ్రులచే ఎంతగా ప్రేమించబడుతున్నారో వారికి తెలిసేలా చేయడానికి నా వంతు కృషి చేస్తా. సహజసిద్ధమైన తల్లి ప్రేమ, భావోద్వేగాలను నేను ఎంతగానో ఇష్టపడతాను" అని ఇలియానా తన మనసులోని మాటను పంచుకున్నారు.





Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR.
Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330